Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :03 | సంచిక : 322 | పేజీలు 8 | వెల : 5 | శుక్రవారం 25 ఏప్రిల్ 2025







## రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం

డైవర్షన్ పాలిటిక్స్‌లో ఆరితేరారు

అవినీతి మితిమీరిపోయింది

అప్పనంగా విశాఖలో భూముల పందేరం

తెరువ చూపిన వైఎస్సార్ కార్యకర్తలకు సెల్యూట్

బాబు సింగిల్ డిజిట్‌కు రాక తప్పదు

ప్రజాప్రతినిధుల భేటీలో జగన్ కీలక వ్యాఖ్యలు

## ఉగ్రవాదులను నిర్దాక్షిణ్యంగా ఏరిపారేయాలి

వారిటపట్ల కనికరం చూపడంలో అర్థం లేదు

అమాయకులను పొట్టన పెట్టుకున్న వారిని వదలకూడదు

మధుసూదనరావు కుటుంబానికి పవన్ కళ్యాణ్ ఓదార్పు




# రియల్ టైమ్‌గవర్నెన్స్ ముఖ్యం

### ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లోనూ మానవీయ కోణం

### రెండురోజుల వర్క్‌షాపులో సిఎం చంద్రబాబునాయుడు



అమరావతి: మానవీయకోణంలో పాలనలో ఏఐ వినియోగించడం ముఖ్యంఅని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.. పాలనలో ఏఐ వినియోగించినా మానవీయకోణం ముఖ్యమని స్పష్టం చేశారు.. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అంశంపై సచివాలయంలో వర్క్‌షాప్ నిర్వహించారు.

సచివాలయంలో రెండు రోజులపాటు- జరగనున్న ఏఐ వర్క్‌షాపులో ఆయన మాట్లాడుతూ.. ఏఐ, ఎమర్జింగ్ టెక్నాలజీల ఆవశ్యకత, పాలనలో వాటి వినియోగంపైనా ఉన్నతాధికారులకు మార్గనిర్దేశర చేశారు. ఈ వర్క్‌షాప్‌నకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, వివిధ శాఖల అధికారులు, కేంద్ర ఐటీశాఖ మాజీ సెక్రెటరీ చంద్రశేఖర్ సహా పలువురు నిపుణులు హాజరయ్యారు.

గుడ్ గవర్నెన్స్ కోసం ఏఐ సహా నూతన -టె-క్నాలజీ వినియోగం, పౌర సేవల్లో మెరుగైన ఫలితాలు సాధించడంపై చర్చించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పౌర సేవల్లో -టె-క్నాలజీ వాడకం, ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలు, ఫలితాలను పరిశీలించారు. ఏయే విభాగాల్లో ఎలాంటి సాంకేతికత వాడొచ్చు. ప్రస్తుత సమాచారం ఆధారంగా సేవలను ఎలా విస్తృత పరచవచ్చు అనే అంశాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. పాలనలో ఏఐ వినియోగించినా.. మానవీయ కోణం ముఖ్యమని సీఎం అన్నారు. -టె-క్నాలజీ వినియోగంతో రియల్-టైమ్‌లో సేవలు అందిస్తామన్నారు. స్మార్ట్ పాలనకు ప్రాధాన్యత ఇస్తూ త్వరలో 'డేటా లేక్' ఏర్పాటు చేస్తామన్నారు. భూ రికార్డుల డిజిటలైజేషన్ వేగంగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఈ వర్క్‌షాప్ రెండు రోజుల పాటు జరగనుంది. టెక్నాలజీ వినియోగంతో రియల్-టైమ్‌లో సేవల డెలివరీ చేయవచ్చు అని..

స్మార్ట్ పాలనకు ప్రాధాన్యత ఇస్తాం.. త్వరలో భారీ డేటా లేక్ ఏర్పాటు- చేయనున్నట్టు వెల్లడించారు..పాలనలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌కు ప్రాధాన్యత ఇస్తూనే, ప్రజలకు సేవల విషయంలో మానవీయకోణం చూపాలన్నారు. ఏఐ ఆధారిత స్మార్ట్ వ్యవస్థ ఏర్పాటుతో రియల్ టైమ్‌లో సేవలు అందించవచ్చని పేర్కొన్నారు..

ఇందుకోసం పాత విధానాల స్థానంలో నూతన సాంకేతికతను ప్రవేశ పెట్టాలి.. టెక్నాలజీ అనేది ప్రజల కోసం ఉపయోగపడాలని స్పష్టం చేశారు.. రాష్ట్రంలో భారీ డేటా లేక్‌ను ఏర్పాటు- చేయడంపై దృష్టి పెట్టాం అన్నారు. ఇంటర్నెట్ కోసం ఎదురుచూసిన రోజుల నుంచి డేటా ఆధారిత పాలన దిశగా ఆంధప్రదేశ్‌ను తీర్చిదిద్దామన్నారు.. వేగంగా భూరికార్డుల డిజిటలైజేషన్ చేయాలన్న సీఎం చంద్రబాబు.. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతుల్లో అధికంగా 75 శాతం భూసంబంధితమైనవే ఉన్నాయని తెలిపారు.. ఈ సమస్య పరిష్కారానికి త్వరితగతిన భూ రికార్డుల డిజిటలైజేషన్ చేయాలన్నారు.



## రాజకీయాల్లో మంచి సంప్రాదాయం ఉండాలి

**కూటమి నేతల తీరుపై బొత్స మండిపాటు**

విశాఖపట్నం: ఏపీలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల ఆర్థిక మూలాల మీద దెబ్బ కొడతామని కూటమి నేతలు బెదిరించడం కరెక్ట్ కాదని మండిపడ్డారు ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ. రాజకీయాల్లో ఇటువంటి సాంప్రదాయం మంచిది కాదని హితవు పలికారు. కూటమి నేతలు ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా మెజార్టీ కార్పొరేటర్లు వైఎస్సార్‌సీపీతోనే ఉన్నారని అన్నారు. ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ తాజాగా విశాఖలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ.. కశ్మీర్‌లో తీవ్రవాదుల కాల్పులు కారణంగా 26 మంది చనిపోవడం బాధాకరం. మన రాష్ట్రానికి చెందిన ఇద్దరు చనిపోవడం దురదృష్టకరం. వారి కుటు-ంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల ఆర్థిక మూలాల మీద దెబ్బ కొడతామని కూటమి నేతలు బెదిరించారు. నేనెప్పుడూ ఇటు-వంటి రాజకీయాలను చూడలేదు. రాజకీయాల్లో ఇటు-వంటి సాంప్రదాయం మంచిది కాదు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల కోసం ప్రత్యేక విమానాలను ఏర్పాటు- చేశారు. 11 నెలల మేయర్ పదవి కోసం అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఈ 11 నెలల కాలంలో ఏం చేస్తారో ప్రజలకు చెబుదాం. ఎన్ని ప్రలోభాలు పెట్టినా మెజార్టీ కార్పొరేటర్లు వైఎస్సార్‌సీపీతోనే ఉన్నారు. వారందరినీ అభినందిస్తున్నాను అంటూ వ్యాఖ్యలు చేశారు.

# నరమేథం సృష్టించిన వారిని వదలబోం

### వారికి అండదండగా ఉన్న వారినీ వదలం

### ప్రపంచదేశాలకు అర్థమయ్యేలా మోడీ హెచ్చరిక

పాట్నా,: కాశ్మీర్‌లో నరమేథం సృష్టించిన ముష్కరులను, వారికి అండగానిలిచిన వారిని వదిలి పెట్టబోమని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ప్రపంచ దేశాలకు భారత్ హెచ్చరిక అర్థం అయ్యేలా ఇంగ్లీష్‌లో కూడా మాట్లాడారు.ప్రధాని నరేంద్ర మోదీ సాధారణంగా హిందీలో ప్రసంగిస్తుంటారు. అంతర్జాతీయ వేదికలపైనా ఇదే భాషలో భారత వైఖరిని స్పష్టం చేస్తుంటారు. కానీ, నేడు బిహార్‌లో నిర్వహించిన ఓ సభలో మాత్రం అరుదైన రీతిలో ఒక్కసారిగా తన ప్రసంగాన్ని హిందీ నుంచి ఆంగ్లంలోకి మార్చారు. పహల్గాం ఉగ్రదాడిని ప్రస్తావిస్తూ.. ఇంగ్లీష్‌లోనూ హెచ్చరించడం గమనార్హం. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తన బలమైన సందేశాన్ని ప్రపంచ దేశాలకు సూటిగా చేరవేసేందుకు ఆంగ్లంలో ప్రసంగించినట్లు- తెలుస్తోంది. ఇండియా విల్ ఐడెంటిఫై, ట్రాక్ అండ్ పనిష్ ఎవ్రీ టెర్రరిస్ట్ అండ్ దేర్ బ్యాకర్స్' అంటూ ప్రధాని మోదీ ఆంగ్లంలో స్పష్టం చేశారు. బిహార్ గడ్డ నుంచి యావత్ ప్రపంచానికి ఒక విషయం స్పష్టం చేస్తున్నా. ఉగ్రవాదులను, వారికి అండగా నిలిచేవారిని భూమిపై ఎక్కడున్నా సరే వెంటాడతాం. ఉగ్రవాదంతో దేశ స్ఫూర్తిని విచ్ఛిన్నం చేయలేరు. ఉగ్రవాదాన్ని శిక్షించకుండా వదిలిపెట్టబోం. బాధితులకు న్యాయం చేకూరేలా అన్ని విధాలా ప్రయత్నిస్తాం. ఈ విషయమై దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉందని అంటూ ప్రధాని మోదీ ఇంగ్లీష్‌లో పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి వేళ భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని మోదీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు చెప్పారు. మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ మాకు అండగా నిలిచారు. వారందరికీ ధన్యవాదాలు అని పేర్కొన్నారు.



## కాశ్మీర్ ఘటనపై కాంగ్రెస్ తీరు బాధాకరం




భద్రతా వైఫల్యం పేరుతో రాజకీయ పాకులాట

కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ బిజెపి లక్ష్మణ్




## స్కూటీలు..తులం బంగారం ఏమాయె

ప్రజలు మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ

వరంగల్ పర్యటనలో కవిత విమర్శలు

తెలంగాణ తలపై కాలేశ్వరం నిర్మించి రైతన్నకు మరోసారి ఇచ్చిన కేసీఆర్ కు మద్దతుగా రైతన్నలు పెద్ద ఎత్తున సభలో పాల్గొనలన్నారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీలో 12 మంది చనిపోతే ఒత్తిడి మేరకు మాత్రమే తెలంగాణ ఇచ్చిందని, ఇప్పుడు అదే కాంగ్రెస్ పార్టీ మళ్లీ మోసం చేస్తుంది కుట్రలు చేస్తుందని ఆమె పేర్కొన్నారు.




## తెలంగాణలో ముదురుతున్న ఎండలు

సాధారణం కంటే పెరగనున్న ఉష్ణోగ్రతలు

# రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. యుద్ధ వాతావరణంలో ప్రజలు బతుకుతున్నారు. దుర్మార్గమైన రెడ్‌బుక్ పాలన జరుగుతోందని వైఎస్ జగన్ మండిపడ్డారు. ప్రజావ్యతిరేకతను అణచివేయడం సాధ్యం కాదన్న ఆయన.. మేనిఫెస్టో అమలు చేయకపోతే ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త నిలదీస్తాడని చెప్పారు. బలం లేకపోయినా స్థానిక సంస్థల్లో టీడీపీ పోటీ చేస్తోంది. ప్రజలు ఓడించారు కాబట్టే.. చంద్రబాబు తన సొంత నియోజకవర్గం చంద్రగిరిని విడిచిపెట్టి కుప్పం వెళ్లిపోయాడు. అక్కడ బీసీలు ఉన్నారు.. వారు ఆర్థికంగా ఇతరత్రా బలంగా ఉండరు కాబట్టి, వారిని తొక్కితొక్కిపెట్టవచ్చని చంద్రబాబు కుప్పంలో పాగావేశారని వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఉప ఎన్నికలు, అవిశ్వాస తీర్మానాల సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు తెగువ చూపారని.. వారందరికీ సెల్యూట్ చేస్తున్నానని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో గురువారం ఆయన భేటీ అయ్యారు. ముందుగా జమ్ముకశ్మీర్‌లోని ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన వారి మృతికి సంతాపంగా వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీ నాయకులు కాసేపు మౌనం పాటించారు. అనంతరం సమావేశం ప్రారంభించారు. చంద్రగిరి ఎంపీపీ ఉప ఎన్నికల్లో గెలిచాక జై జగన్, జై వైఎస్సార్‌సీపీ అన్నారని కేసులు పెట్టారు. గ్రామాల్లో తెలుగుదేశం నాయకులు తిరిగే ధైర్యం లేదు. తిరిగితే ఇచ్చిన హామీలపై ప్రజలు నిలదీస్తారు. రాష్ట్రంలో వ్యవస్థలన్నీ విధ్వంసం. ప్రభుత్వ స్కూళ్లకు వెళ్లడాన్ని నరకంగా మార్చేశారు. విద్యా, వైద్య రంగాలు దారుణంగా తయారయ్యాయి. చంద్రబాబుగారు అధికారంలో వచ్చాక 4 లక్షలు పెన్షన్లు తీసేశారు. అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయింది. బెల్టుషాపులు గుడి, బడి పక్కనే కనిపిస్తున్నాయి. ప్రతి బాటిల్‌పైన రూ.20ల ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. వైఎస్సార్‌సీపీలో కన్నా ఇసుక రేటు రెండింతలు పెరిగింది. ఉచితం అని చెప్పి.. దోచుకుంటున్నారు. పైనుంచి కిందిదాకా ముడుపులు చెల్లిస్తేనే మైనింగ్ అయినా, పరిశ్రమ అయినా నడిచేది. అవినీతినుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి డైవర్షన్ టాపిక్స్ ఎంచుకుంటున్నారు. విశాఖపట్నంలో ఊరూపేరు లేని ఉర్సా లాంటి కంపెనీలకు రూ.3,000 కోట్లు- ఖరీదు చేసే భూములిస్తున్నారు. ఒక చిన్న ఇంట్లో రెషిడెన్షియల్ అపార్ట్‌మెంట్ కట్టే కరెంటు బిల్లు ఆ కంపెనీ కడుతుంది. అమెరికాలో వాళ్ల ఆఫీసు చూస్తే.. అది కూడా చిన్న ఇల్లే. రూపాయికి ఇడ్లీ వస్తుందో లేదో తెలియదు కానీ చంద్రబాబు హయాంలో ఉర్సా లాంటి ఊరూ పేరు కంపెనీకి రూ.3,000 కోట్ల డబ్బులు దోచిపెడుతున్నారు. విశాఖఫట్నంలో లూలు గ్రూపులకు, లిల్లీ గ్రూపులకు రూ.1500- 2000 వేల కోట్లు- ఖరీదు చేసే భూములను.. టెండర్లు లేకుండా కట్టబెట్టారు. లెఫ్ట్, రైట్, సెంటర్ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు. అమరావతి నిర్మాణ పనుల్లోనూ దోపిడీ. 2018లో ఐదేళ్ల కిందట చంద్రబాబు హయాంలో టెండర్లు పిలిచినప్పుడు పనుల విలువ రూ. రూ.36,000 కోట్లు-. అప్పట్లో ఇప్పటికన్నా స్టీలు, సిమెంట్లు రేట్లు ఎక్కువ. అయినా కూడా ఆ రూ.36,000 కోట్ల విలువ ఈరోజు రూ.78,000 కోట్లకు
పెంచేశారు. టెండర్లు రింగ్ ఫార్మ్ చేసి వాళ్ల కాంట్రాక్టర్లకే ఇచ్చుకుంటున్నారు. మొబలైజేషన్ అడ్వాన్సులు కొత్తగా ఇవ్వడం మొదలుపెట్టాడు. 10 శాతం మొబలైజేషన్ అడ్వాన్స్‌లు ఇవ్వడం, అందులో 8శాతం కమిషన్లుగా తీసుకోవడం.. ప్రభుత్వం చేసిన అప్పులన్నీ ఎక్కడకు పోతున్నాయో తెలియడంలేదు. గతంలో ఎందుకు జగన్ చేయగలిగాడు.. చంద్రబాబు ఎందుకు చేయలేకపోతున్నాడని అంటూ వైఎస్ జగన్ ప్రశ్నించారు. జగన్ నేరుగా బటన్ నొక్కి అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి వేసేవాడు. ఇప్పుడు చంద్రబాబు హయాంలో బటన్లు లేవు.. నేరుగా ఆయన జేబులోకే పోతున్నాయి. ఇదే విషయాన్ని ఎన్నికల సమయంలో మొత్తుకుని చెప్పాను. చంద్రబాబు నాయుడుని నమ్మడం అంటే చంద్రముఖిని నిద్రలేపడమే. ఈ రోజు ప్రతి ఇంట్లో చర్చ జరుగుతోంది. వీటికి సమాధానం చెప్పుకోలేక ప్రతిరోజూ డైవర్షనే. ఒక రోజు లడ్డూ, మరోరోజు బోటు-.. ఇంకోరోజు ఐపీఎస్ అధికార్ల అరెస్టులు అంటూ డైవర్షన్లు చేస్తున్నారని మండిపడ్డారు. కరెంటు బిల్లులు షాక్ కొట్టేలా పెంచారు.. వీటి గురించి అడిగితే.. ఆయన చేసిన లిక్కర్ స్కాంను మరలా ఇంకొకరు మీద రుద్ది అరెస్టు చేస్తాడు. ఇలా ప్రతి రోజూ ఏదో ఒక సెన్సేషన్ క్రియేట్ చేసి దాన్నుంచి టాపిక్ డైవర్షన్ చేయడం పరిపాటిగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో పాలన జరుగుతుంది. ఎంతో మంచి చేసిన మనమే ప్రతిపక్షంలో కూర్చొన్నాం. ఇక ఏ మంచీ చేయకుండా, మోసం చేసిన చంద్రబాబు పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పక్కరలేదన్నారు. ఇంత మోసం చేసిన మనిషిని ప్రజలు సింగిల్ డిజిట్ రాని పరిస్థితుల్లోకి పరిమితం చేస్తారు.ఆ రోజు వస్తుంది. కచ్చితంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అఖండమైన మెజార్టీతో అధికారంలోకి వస్తుంది. ప్రతి కార్యకర్తకు.. మన ప్రభుత్వంలో మీ జగన్ 2.0లో తోడుగా ఉంటాడు అని హామీ ఇస్తున్నాను. ఈ రోజు కార్యకర్త ఎంతలా ఇబ్బంది పడుతున్నాడో చూస్తున్నానని వైఎస్ జగన్ అన్నారు. చంద్రబాబు నాయుడు పాలనలో అవినీతి విరుచుకుపడిందని, ప్రజలపై భారం పెడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థల్ని దెబ్బతీశారని జగన్ విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వంలో 4 లక్షల పింఛన్లు తీయించారని, ప్రభుత్వ విద్యా వ్యవస్థను పూర్తిగా దిగజార్చారని జగన్ విమర్శించారు. జగన్ హయాంలో డైరెక్ట్ బెనిఫిట్ ద్వారా నేరుగా ఖాతాల్లోకి డబ్బులు వెళ్లేవని గుర్తుచేశారు. వైసీపీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేసిన జగన్, 'జగన్ 2.0లో ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని స్పష్టం చేశారు. చంద్రబాబునాయుడుని నమ్మడం అంటే చంద్రముఖిని నిద్రలేపడమే. ప్రజలు మోసాన్ని గుర్తించి ఆయనను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేస్తారని జగన్ హెచ్చరించారు.

## కాశ్మీర్ ఘటనపై కాంగ్రెస్ తీరు బాధాకరం

హైదరాబాద్:ఉగ్రదాడిపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు బాధాకరమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ భద్రతా వ్యవస్థ వైఫల్యాన్ని చూపించేందుకు ప్రయత్నిస్తూ రాజకీయ లబ్ధి కోసం మాట్లాడుతుందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో
మాట్లాడిన లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాజాగా జరిగిన కాంగ్రెస్ నేతలు సమావేశంలో దాడి ఘటనను పొలిటికల్ ఈవెంట్‌లా మార్చే ప్రయత్నం చేశారని ఆయన ఆరోపించారు. భద్రతా సమస్యపై అసత్య ప్రచారాలు చేసి ప్రజల్లో అపోహలు సృష్టించేందుకు కాంగ్రెస్ పూనుకుంటోందని విమర్శించారు. కాగా, కాంగ్రెస్ పార్టీకి పాకిస్తాన్ పట్ల ఉన్న ప్రేమ కొత్తది కాదని, ఇప్పటికే మన రాష్ట్రానికి చెందిన కొందరు కాంగ్రెస్ నేతలు పాకిస్తాన్‌ను ప్రేమిస్తున్నారని అన్నారు. అలాంటి నేతలకు భారత భద్రతపై మాట్లాడే అర్హత లేదని ఆయన అన్నారు. అలాగే కాంగ్రెస్ నేతలు హిందువులపై దాడులను నెపంగా చూపించి 'సాఫ్రాన్ టెర్రరిజం' అంటూ మాట్లాడినవాళ్లే.. ఇప్పుడేమిటో 'ఇస్లామిక్ టెర్రరిజం', 'జిహాదీ టెర్రరిజం' అనే పదాలను ఉపయోగించేందుకు కూడా భయపడుతున్నారని విమర్శించారు. రాబర్ట్ వాద్రా చేసిన వ్యాఖ్యలు ఉగ్రవాదాన్ని సమర్థించేలా ఉన్నాయని పేర్కొంటూ, కాంగ్రెస్ పార్టీ అతని వ్యాఖ్యలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కావాల్సినప్పుడు మాట్లాడే బీఆర్ఎస్ పార్టీ ఈ విషయంలో మాత్రం నోరు మెదపకపోవడమేమిటని ఆయన అన్నారు. మజ్లిస్ పార్టీకి మద్దతు ఇవ్వాలన్న ఉద్దేశంతోనే ఇలా చేస్తుందా అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. ట్విట్టర్ లో చురుగ్గా ఉండే కేటీఆర్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో మజ్లిస్‌కు సహకరించారని అన్నారు. చివరగా కాంగ్రెస్ చౌకబారు రాజకీయాలు మానుకోవాలని, దేశ భద్రత వంటి సున్నిత అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదని ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ అన్నారు.

## ఉగ్రవాదులను నిర్దాక్షిణ్యంగా ఏరిపారేయాలి

నెల్లూరు: ఉగ్రవాదుల ఏరివేతలో కనికరం ఉండరాదని, వారిని క్షమించరాదని డిప్యూటి సిం పవన్ కళ్యాణ్ అన్నారు. వారికి మతం,మానవత్వంవ లేదన్నారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన మధుసూదనరావుకు డిప్యూటీ-సీఎం పవన్ కళ్యాణ్ నివాళులర్పించారు. గురువారం కావలి చేరుకున్న పవన్.. నేరుగా మధుసూదనరావు ఇంటికి వెళ్లి.. ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆపై కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. కాశ్మీర్‌లో కిరాతకంగా తూటాలు పేలిస్తే, దేశ వ్యాప్తంగా మధుసూదనరావుకు నివాళులర్పించారన్నారు. ఈ సంఘటనను కుటుంబ సభ్యులు ఇంకా నమ్మలేకపోతున్నారని తెలిపారు. వారితో మాట్లాడినప్పుడు... ఆయన భార్య, పిల్లలు ఏం జరిగింది.. ఎలా జరిగిందో చెప్పారన్నారు. వాళ్లు చెబుతుంటే తనకే పేగులు మెలబెట్టినట్టు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ధర్మాన్ని ఆచరిస్తారని తెలుసుకుని హతమార్చారంటే ఎంతటి దారుణమని మండిపడ్డారు. ఉగ్రవాదులు ఎక్కడున్నా సరే నిర్దాక్షిణ్యంగా ఏరేయాలి, మనకి కనికరం ఎక్కువైపోయింది అని అన్నారు. తాను మాట్లాడలేక పోతున్నానని.. రేపో, ఎల్లుండో మంగళగిరిలో ప్రెస్‌మీట్ పెట్టి అన్ని వివరిస్తానని తెలిపారు. శుక్రవారం వైజాగ్ కూడా వెళుతున్నానని చెప్పారు. ఎంత శాడిస్టికల్‌గా, మెతడాలికల్‌గా, కోల్డ్ బ్లెడెడ్‌గా చంపేశారన్నారు. కాశ్మీర్ రెండేళ్లుగా ప్రశాంతంగా ఉందనే ఇంతటి దారుణానికి, కిరాతకానికి పాల్పడ్డారని మండిపడ్డారు. సమ్మర్‌లో షూటింగ్ కోసం కాశ్మీర్‌కు చాలా సార్లు వెళ్లానని.. అక్కడ పరిస్థితులు తనకు తెలుసన్నారు. ఉగ్రవాదులు ఎక్కడున్నా నిర్దాక్షిణ్యంగా ఏరేయాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. పవన్ వెంట మంత్రులు ఆనం, నాదెండ్ల, సత్యకుమార్, ఎమ్మెల్యేలు కావ్యా కృష్ణారెడ్డి, సోమిరెడ్డి, ఆర్ఎస్ఎస్ జాతీయనేత మధుకర్ ఉన్నారు.కాగా.. జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రమూకల దాడిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మధుసూదన్‌రావు ప్రాణాలు కోల్పోయాడు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్‌గా స్థిరపడ్డ మధుసూదన్ ఫ్యామిలీతో కలిసి పహల్గామ్ విహారాయత్రకు వెళ్లారు.
అయితే ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో అతడు మృతిచెందాడు. బుధవారం రాత్రి మధుసూదన్ మృతదేహాన్ని చెన్నై ఎయిర్‌పోర్టుకు.. అక్కడి నుంచి రోడ్డు మార్గాన నెల్లూరు జిల్లా కావలికి తీసుకొచ్చారు. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీమున్నీరుగా విలపించారు. ఇక పెహల్గామ్ ఉగ్రదాడిలో మరో ఏపీ వాసి కూడా ప్రాణాలు కోల్పోయాడు. విశాఖకు చెందిన రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి చంద్రమౌళి ఉగ్రమూకల దాడిలో మృతిచెందాడు.

## స్కూటీలు..తులం బంగారం ఏమాయె

వరంగల్: వరంగల్ గడ్డ అంటే ఉద్యమాల గడ్డని, తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిందని.. వరంగల్ లో సభ పడితే విదేశాల్లో ఉన్న వాళ్ళు కూడా వచ్చి మద్దతు తెలిపారని
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గుర్తు చేసారు. వరంగల్ జిల్లాలో ఆమె పర్యటించారు. ఈ నేపథ్యంలో ఆమె ఓరుగల్లులోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడ ఆమె ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఎల్కతుర్తి లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆపై మీడియాతో ముచ్చటించారు. తెలంగాణ ఉనికిని కోల్పోతున్న సమయంలో కేసీఆర్ పిడికిలి బిగించి తెలంగాణ ఉద్యమంతో అందరినీ ఒక్క తాటికి పైకి తెచ్చి తెలంగాణ ను ఉనికి కాపాడాడన్నారు. 2001లో కేసీఆర్ పెట్టిన తెలంగాణ పార్టీ టిఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాలు పూర్తిచేసుకుందని తెలిపారు. ఇక ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆడపిల్లల్ని మోసం చేసిందని.. స్కూటీలు ఇస్తామని విద్యార్థులు మోసం చేసారని అన్నారు. అలాగే బంగారం ఇస్తామని చెప్పి మహిళలను మోసం చేసారని తెలిపారు. ఇలా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలంటే మహిళలు సభకు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు.
తెలంగాణ తలపై కాలేశ్వరం నిర్మించి రైతన్నకు మరోసారి ఇచ్చిన కేసీఆర్ కు మద్దతుగా రైతన్నలు పెద్ద ఎత్తున సభలో పాల్గొనలన్నారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీలో 12 మంది చనిపోతే ఒత్తిడి మేరకు మాత్రమే తెలంగాణ ఇచ్చిందని, ఇప్పుడు అదే కాంగ్రెస్ పార్టీ మళ్లీ మోసం చేస్తుంది కుట్రలు చేస్తుందని ఆమె పేర్కొన్నారు. ఆ కుట్రలన్నిటిని పటాపంచలు చేయాలంటే ఈ సభను విజయవంతం చేయాలని ఆమె కోరారు. కేసీఆర్ మహిళలకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించే లాగా రిజర్వేషన్ తీసుకువచ్చిన ఘనత ఉందని, ఎల్కతుర్తి సభలో ప్రత్యేక మహిళా గ్యాలరీలను ఏర్పాటు- చేస్తున్నమని, సభకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటామని అవ్విడా తెలిపారు. కాంగ్రెస్ నాయకుల్లారా ఖబర్దార్.. ప్రజలకు నీ మోసం ఏంటో తెలిసిపోయిందని, 16 నెలల్లోనే మీరు ఏమి చేయలేరని తెలంగాణ ప్రజలకు తేలిపోయిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకుల్లారా అవాకలు చెవాకులు పేలుస్తున్నారు. మా సభలో పల్లీలు, బఠానీలు అమ్ముకునే అంత మంది కూడా మీరు ఉండరు. అవాకులు, చివాకులు పేలిస్తే చూస్తూ ఊరుకోమని అన్నారు. రూపాంతరం చెందడం అనేది సర్వసాధారణం.. టీ-ఆర్ఎస్ బీఆర్ఎస్ గా రూపాంతరం మాత్రమే చెందింది.. పార్టీ మారలేదని ఆవిడ మాట్లాడారు.

## తెలంగాణలో ముదురుతున్న ఎండలు

### సాధారణం కంటే పెరగనున్న ఉష్ణోగ్రతలు



హైదరాబాద్ తెలంగాణలో రానున్న రెండు రోజుల్లో ఎండల తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-3 డిగ్రీలు ఎక్కువగా ఉండే వీలుందని వెల్లడించింది. ఇవాళ, రేపు ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా వడగాల్పులు వీచే అవకాశముందని పేర్కొంది. చాలా జిల్లాల్లో రాత్రిపూట వేడి వాతావరణం మరింత ఎక్కువగా ఉండనుందని తెలిపింది. ఉత్తర, దక్షిణ ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. శుక్ర, శనివారాల్లో కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే వీలుందని పేర్కొంది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశముందని వెల్లడించింది.

## పదేళ్ల బిఆర్ఎస్ పాలన స్వర్ణయుగం




హైదరాబాద్: తన పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేసీఆర్ ఉద్యమ నినాదాలను నిజం చేశారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గ్రామస్వరాజ్యం కోసం జాతిపిత మహాత్మాగాంధీ కన్న కలలను కూడా సాకారం చేశారని చెప్పారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా కేటీఆర్.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన పల్లె ప్రగతిని గుర్తుచేస్తూ తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. ఆ పోస్టులో కేటీఆర్.. 'పదేళ్ల పాలనలో ఉద్యమ నినాదాలను నిజం చేయడమేగాక గ్రామస్వరాజ్యం కోసం జాతిపిత మహాత్ముడు కన్న కలలను కూడా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సాకారం చేశారు. ఇవాళ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకుంటు-న్న వేళ.. పల్లెసీమలే దేశానికి పట్టు-గొమ్మలన్న మహాత్మా గాంధీ ఆశయాలే స్ఫూర్తిగా బీఆర్ఎస్ పాలనలో ప్రాణం పోసిన 'పల్లెప్రగతి'ని గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. సమైక్య పాలనలో దశాబ్దాలపాటు- దగాపడ్డ పల్లెలను దర్జాగా కాలర్ ఎగరేసుకునే స్థాయికి తీర్చిదిద్దిన సందర్భాలు అపూర్వం. అనితర సాధ్యం.' అని పేర్కొన్నారు. సమస్యల సుడిగుండంలో విలవిలలాడిన ప్రతి పల్లె నాడు సకల సౌకర్యాల హరివి÷-లలైంది. కేసీఆర్ సంకల్పంతో ప్రతి పల్లెసీమ ప్రగతిసీమగా మారింది. ప్రతి పల్లెలో డంప్ యార్డు తప్ప.. చెత్త కంపు లేని స్థితి వచ్చింది. కూలిపోయే స్థితి ఉన్న ఖాళీ ఇండ్ల కిరికిరి నుంచి పొంగిపొర్లే మురికి కాలువల శుభ్రత వరకూ ప్రతి సమస్యకు పదేళ్ల పాలనలో శాశ్వత పరిష్కారం దొరికింది. కలుషిత నీటి కలకలం లేకుండా, సీజనల్ రోగాల చింతలేకుండా సాగిన పంచాయతీల ప్రస్థానం గ్రామ స్వరాజ్యంలో ఓ స్వర్ణయుగం.' అని కేటీఆర్ రాసుకొచ్చారు. పచ్చదనానికి కొదవ లేకుండా, నిధులకు కొరత లేకుండా, విధులకు ఆటంకం లేకుండా, ప్రతి ఊరును మెరుగైన జీవనానికి మారుపేరుగా మార్చింది కేసీఆర్ విజనే. దేశంలో 3 శాతం జనాభా ఉన్న తెలంగాణ, పల్లెప్రగతిలో 30 శాతం అవార్డులను గెలుచుకోవడం పల్లె ప్రగతిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరి విజయం. నాడు పదేళ్లపాటు- మురిసిన పల్లె, కాంగ్రెస్ పాలనలో నేడు మళ్లీ కన్నీరు పెడుతోంది. కాంగ్రెస్ పాలనలో గ్రామస్వరాజ్యం పూర్తిగా గాడితప్పింది. ఏడాదిన్నర గడిచినా స్థానిక సంస్థలకు ఎన్నికలు లేవు. 15వ ఆర్థిక సంఘం నిధులు లేవు. గ్రామాల్లో కనీస వసతులు లేవు. పల్లె ప్రజలకు గుక్కెడు మంచినీళ్లు దిక్కు లేవు.' అని కేటీ-ఆర్ నేటి దుస్థితిని వివరించారు.
చివరికి రాష్ట్రంలో పంచాయతీ సిబ్బందికి వేతనాలు లేవు. ఉపాధి హామీ కూలీలకు పనిదినాలు లేవు. మాజీ సర్పంచ్‌ల బిల్లులకే మోక్షం లేదు. దేశంలోనే ఆదర్శ గ్రామాలకు చిరునామాగా నిలిచిన తెలంగాణ పల్లెలు అధ్వాన పరిస్థితులకు అడ్రస్‌గా మారడం అత్యంత బాధాకరం. ఢిల్లీ పార్టీలను నమ్మిన పాపానికి
పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిన తీరును తెలంగాణ పల్లె ప్రజలు గమనిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉండి తీవ్ర అన్యాయం చేస్తున్న బీజేపీకి, పచ్చని పల్లెలను సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్ పార్టీకి జనం కర్రుకాల్చి వాతపెడుతరని హెచ్చరించారు.

## గ్రామాలు స్వయం ప్రతిపత్తి సాధించాలి



అమరావతి: గ్రామాలు స్వయం ప్రతిపత్తి గల వ్యవస్థలుగా ఏర్పడాలని గాంధీజీ చెప్పేవారని, తాను నగరాల్లో ఉన్నా.. పల్లెల్లో ఉండాలనే కోరిక ఉండేదని డిప్యూటీ సీఎం, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. పల్లెల అభివృద్ధి ఎంతో కీలకం అని తన అభిప్రాయం వ్యక్తం చేశారు. పంచాయతీలకు ఇచ్చిన నిధులు వాటికే ఖర్చు చేయాలని చెప్పానని.. అలాగే అమలు చేస్తున్నానని అన్నారు. ఈ విషయంలో తనకు సహాయ సహకారాలు అందిస్తున్న శశిభూషణ్, కృష్ణ తేజ , ఇతర అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ సభ గురువారం అమరావతి లోని సికె కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధిని చూపిస్తూ ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. గ్రామాల్లో రోడ్లు, మంచినీరు, మౌలిక వసతుల కల్పన వంటి పురోగతిని పవన్‌కు అధికారులు వివరించారు. అంతకుముందు కార్యక్రమంలో పహెల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ అందరూ మౌనం పాటించారు. అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పాటు- అయిన సందర్భంగా తాను పంచాయతీ రాజ్ శాఖను ఇష్టంగా ఎంచుకున్నానని చెప్పారు. నేడు గ్రామాల్లో రోడ్లు, నీరు, ఇతర మౌలిక వసతులు కల్పించడంలో కీలక పాత్ర వారిదేనన్నారు. ఈ అభివృద్ధి పనులకోసం నగలు తాకట్టు- పెట్టి పనులు చేశారని, నిధులు రావడంలో కొంత జాప్యం జరిగిందన్నారు. దీని వల్ల కాంట్రాక్టర్‌లకు బిల్లులు ఇవ్వలేక పోయామన్నారు. త్వరలో నిధులు వస్తాయని... అందరికీ బిల్లులు చెల్లిస్తామని పవన్ కళ్యాణ్ భరోసా ఇస్తున్నామన్నారు. పంచాయతీల వ్యవస్థ బలోపేతం చేయడం కోసం తొలుత అధ్యయనం చేశానని, సిఫార్సులు, డబ్బులు లేకుండా బదిలీ ఉండదనే అభిప్రాయం ఉందన్నారు. ఎవరూ పైరవీలు చేయవద్దని తన పేషీ నుంచి ఆదేశాలు స్పష్టంగా ఇచ్చానని చెప్పారు. ఈసారి అన్ని స్థాయిల్లో అవినీతి లేకుండా బదిలీలు జరిగాయన్నారు. తాను సమర్థవంతంగా పని చేసే అధికారులను వెతికి పట్టు-కున్నానని, గతంలో నిర్లక్ష్యానికి గురి కాబడిన వారిని గుర్తించి ప్రతిభ ఆధారంగా పోస్టింగ్ ఇచ్చానని చెప్పారు. తనకు అనేక రూపాల్లో సిఫార్సులు వచ్చినా తాను నిబంధనల ప్రకారం వెళతానని చెప్పి అమలు చేశానన్నారు. కొన్ని గ్రామాలు వర్గ పోరు, కులాలపోరు వల్ల నష్టపోయాయని, కూటమికి చెందిన సర్పంచ్‌లు లేకపోయినా.. మేము ప్రజలకోసం ఆలోచన చేశామన్నారు. పంచాయతీ సర్పంచ్, ఎంపిటిసి, జడ్పీటీసీ, ఎంపిపిలకు ఇచ్చే మర్యాద, గౌరవం ఇచ్చామని అన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి, వారి నిధులు కూడా మళ్లించిందని, రూ. 1120 కోట్లు మన ప్రభుత్వం వచ్చాక పంచాయతీల అభివృద్ధికి వినియోగించామని పవన్ చెప్పారు. 100 నుంచి పది వేలు, 250 నుంచి 25 వేలు పంచాయతీల కు పెంచామన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీ అనే పదం వాడకూడదన్నారు. గ్రామాల అభివృద్ధికి
వాడే శ్రామికులు అంటే బాగుంటు-ందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పంచాయతీ రాజ్ శాఖ అధికారులు కూడా దీనిపై ఆలోచన చేయాలని, నరేగా శ్రామికులు గానే ఇక నుంచి అందరూ పిలవాలని, ఉపాధి శ్రామికులకు వంద రోజుల పనికల్పించామన్నారు. గ్రామ సభల ద్వారా ప్రజల అవసరాలను గుర్తించి పనులు చేశామని, రూ. 10,690 కోట్లు- తొమ్మిది నెలల పాలనలో ఖర్చు చేసి గ్రామాలు అభివృద్ధి చేశామన్నారు. రూ. 1005 కోట్లతో గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి చేశామన్నారు. ఏపీ అభివృద్ధిలో పంచాయతీ రాజ్ శాఖ పని తీరు చాలా కీలకమని, ఉద్యోగులు, సిబ్బందికి మేము ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని పవన్ కళ్యాణ్ తెలిపారు. గ్రామీణాభివృద్ధిలో మోదీ, చంద్రబాబు నాయకత్వంలో మన ఏపి 24వ స్థానం నుంచి రెండో స్థానంలోకి వచ్చిందన్నారు. చిత్తశుద్ధితో పని చేస్తే మంచి ఫలితాలు ఉంటాయ నేందుకు ఇదే నిదర్శనమన్నారు. గ్రామాల్లో కలప మొక్కలు పెంచాలని నిర్ణయించామని, ఏపిలో నాలుగో వంతు ఉన్న దేశాల్లో కలప ప్రధాన ఆదాయ వనరుగా ఉందన్నారు. ఏపిలో కూడా కలప పెంచి ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలన్నారు. గ్రామాల్లో ఉష్ణోగ్రతలు తగ్గించడంతో పాటు-, ఆదాయం కూడా వస్తుందని, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అందరూ ఈ దిశగా ఆలోచన చేయాలని సూచించారు. స్వర్ణాంధ్ర, ఆత్మ నిర్భర్ భారత్ సాధించేలా అందరూ కలిసి నడవాలని పిలుపిచ్చారు. చాలా ప్రాంతాల్లో పాఠశాలలకు ఆట స్థలాలు లేవని, రైల్వే కోడూరులో ఒక గ్రామంలో ఆట స్థలం కొని ఇవ్వాల్సి వచ్చిందన్నారు. చాలా గ్రామాల్లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయని, గ్రామాల్లో అసలు ఎంత భూమి ఉంది... ఎవరెవరు స్వాధీనం చేసుకున్నారో తేల్చాలని అధికారులకు సూచించారు. ఎటు-వంటి రాజకీయ పక్షాల అడ్డంకులు ఉన్నా తనకు చెప్పాలన్నారు. అన్ని గ్రామాల్లో స్థలాల వివరాలు తనకు అందించాలి పవన్ కళ్యాణ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ధరణితో రైతులకు తీవ్ర నష్టం

సిద్దిపేట: గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ ద్వారా చాలా మంది రైతులకు నష్టం జరిగిందని.. అలాంటి తప్పులు మళ్లీ జరగొద్దనే రైతులకు సులభంగా అర్థమయ్యే రీతిలో భూ భారతి తీసుకొచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇందులో భాగంగానే భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. గురువారం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి అంటేనే ఆత్మగౌరవం. అలాంటి భూమి వివాదాల్లో ఉండకుండా సమస్యల పరిష్కారం కోసం భూ భారతి చట్టం తీసుకొచ్చామని, రైతులకు భూ భారతి ఎంతగానో ఉపయోగ పడుతోందన్నారు. ధరణిలో 30 లక్షల మంది భూ సమస్య ఉందని పిటిషన్ పెట్టుకున్నారు. ఆ సమస్యలు భూ భారతి ద్వారా పరిష్కారం అవుతాయన్నారు. త్వరలోనే గౌరవెల్లి కాలువల నిర్మాణం పూర్తవుతుందని.. ప్రాజెక్ట్ ద్వారా నీళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్ట్ భూ సేకరణ సమయంలో కొంత మంది రైతులకు నష్టం జరిగిన వారిని ఆదుకుంటామని భరోసా కల్పించారు.
భూ భారతి చట్టాన్ని అందరి ఆమోదంతోనే అమలు చేశామని మంత్రి అన్నారు. కొంతమంది వీఆర్వోలు కేసీఆర్ చెప్పిన పనులు చేయలేదని అర్ధరాత్రికి రాత్రి వీఆర్వో వ్యవస్థను రద్దు చేశారన్నారు. త్వరలో రెవిన్యూ వ్యవస్థలో జీపీఏ వ్యవస్థను తీసుకొస్తామని అన్నారు. కొత్త చట్టం తీసుకొస్తే ప్రజలకు ఉపయోగపడాలి కాని భారంగా మారకూడదన్నారు. గత ప్రభుత్వంలో కబ్జా చేసిన ప్రభుత్వ భూములను.. అక్రమ పట్టాలను రద్దు చేస్తామన్నారు. భూభారతిపై రైతులు అవగాహన కల్పించేందుకే అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని.. భూభారతి చట్టంలో తహశీల్దార్ నుంచి సీసీఎల్ఏ స్థాయి వరకు సమస్యలు పరిష్కరించేందుకు వెసులుబాటు కల్పిస్తామన్నారు. భూమి రిజిస్ట్రేషన్ కు ముందు తప్పనిసరిగా భూ సర్వే చేసి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుదని.. భూభారతి పోర్టల్ లో అన్ని సమస్యలకు స్వయంగా దరఖాస్తు చేసుకునేలా రూపొందించారు. భూభారతి పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్నామని, ఒక్క రూపాయి ఫీజు లేకుండా భూ సమస్యలను పరిష్కరిస్తామని.., అధికారులనే క్షేత్రస్థాయికి పంపిస్తున్నామన్నారు. నెలాఖరులోగా నాలుగు మండలాల్లో అన్ని వివరాలు సేకరించి, జూన్ 2న పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నా రు. మే1వ తేదీ నుంచి మరో 28 జిల్లాల్లో ఒక్కో మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకుని భూభారతిని అమలు చేస్తామన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఏమైనా సూచనలు వస్తే నియమనిబంధనల్లో మార్పులు, చేర్పులు చేస్తామన్నారు. గత ప్రభుత్వం అనాలోచనతో 2020 ధరణి చట్టాన్ని తీసుకొచ్చి... ప్రజలకు అనేక ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ధరణి చట్టాన్ని తీసుకొచ్చిన మూడేళ్ల వరకు నియమ నిబంధనలు రూపొందించలేదని... విధివిధానాలు స్పష్టంగా తెలియజేయలేదని.. కేసీఆర్ నోట ఏది వస్తే ఆ మాట ప్రకారమే నడుచుకుందన్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందుల నుంచి విముక్తి చేసేందుకు ఇందిరమ్మ రాజ్యంలో 2025లో భూభారతి చట్టాన్ని తెచ్చామన్నారు. అధికారులు ఉద్దేశ్యపూర్వకంగా తప్పులు చేస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉత్తేజిత దినపత్రిక



# రాజీవ్ యువ వికాస పథకంలో.. వీరికే ప్రాధాన్యత..

భద్రాద్రి: భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి (బీటీపీఎస్) రైలు మార్గం కోసం భూములు కోల్పోయి పరిహారం తీసుకోని నిర్వాసితులకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా స్వయం ఉపాధికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. వారికి రూ. 4 లక్షల వరకు రుణం, 70 శాతం రాయితీ లభించనుంది. మిగిలిన 30 శాతం జెన్కో చెల్లిస్తుంది. ఈ ఆర్థిక సహాయంతో నిర్వాసితులు సొంతంగా వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం లభిస్తుంది.




భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి (బీటీపీఎస్) రైలు మార్గం ఏర్పాటు కారణంగా భూములు కోల్పోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పరిహారం తీసుకోని నిర్వాసితులకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా స్వయం ఉపాధి పొందేందుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ నిర్వాసితులకు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ నిర్ణయం వల్ల చాలా కాలంగా ఎదురుచూస్తున్న నిర్వాసితులు సొంతంగా ఉపాధి పొంది ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం లభించనుంది. ఇటీవల రాజీవ్ యువ వికాస యోజన కింద అర్హులైన యువత నుంచి దరఖాస్తులను ప్రభుత్వం స్వీకరించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగానే.. ప్రభుత్వం దీనిపై కసరత్తు ప్రారంభించింది. ఈ స్కీమ్‌కు దరఖాస్తుల ప్రక్రియ ఏప్రిల్ 14వ తేదీతో ముగిశాయి.

మణుగూరు నుండి బీటీపీఎస్‌కు బొగ్గు రవాణా కోసం రైలు మార్గం నిర్మించాలని 2019లో నిర్ణయించారు. ఇందుకోసం సాంబాయిగూడెం, రామానుజవరం, కొండాయిగూడెం గ్రామాలకు చెందిన 104 మంది రైతుల నుండి భూమిని సేకరించారు. అయితే.. తమకు ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ రైతులు అప్పటి నుండి పరిహారం తీసుకోలేదు. రైతుల నుండి సేకరించిన భూమి చాలా తక్కువగా (5 నుండి 20 గుంటల వరకు) ఉండటంతో ఉద్యోగాలు కల్పించడం సాధ్యం కాదని ప్రభుత్వం చెబుతూ వస్తోంది. దీనివల్ల రైలు మార్గం పనులు కూడా ఆలస్యమవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించింది. నిర్వాసితులకు రాజీవ్ యువ వికాసం పథకంలో మొదటి ప్రాధాన్యత కల్పించనుంది.

రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకున్న రైలు మార్గం నిర్వాసితులు రూ. 4 లక్షల వరకు రుణం పొందవచ్చు. ఈ రుణంలో 70 శాతం వరకు రాయితీ లభిస్తుంది. మిగిలిన 30 శాతం లబ్ధిదారులు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. అయితే.. ఈ 30 శాతం మొత్తాన్ని జెన్కో సంస్థ చెల్లించనుంది. దీని ప్రకారం.. నిర్వాసితులు కోల్పోయిన భూమికి పరిహారంతో పాటు, పునరావాసం మరియు పునస్థాపన (ఆర్అండ్ఆర్) కింద రూ. ఒక లక్ష.. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా రూ. 4 లక్షలు పొందనున్నారు. ఈ ఆర్థిక సహాయంతో నిర్వాసితులు సొంతంగా వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం లభిస్తుంది. భూమిని కోల్పోవడం, పంట లేకపోవడం, పరిహారం తీసుకోకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్న నిర్వాసితులకు ప్రభుత్వం ఈ విధంగా చేయూతనిస్తోంది. నిర్వాసితులకు ఆర్థికంగా సహాయం చేయడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని స్థానిక మండల తహసీల్దార్ రాఘవరెడ్డి తెలిపారు. ఇంకా ఎవరైనా నిర్వాసితులు దరఖాస్తు చేసుకోని ఉంటే తమకు తెలియజేయాలని ఆయన కోరారు.



# వాతావరణ శాఖ హెచ్చరిక..

తెలంగాణ: రానున్న మూడు రోజుల్లో తెలంగాణలో తీవ్రమైన వడగాల్పులు, ఉక్కపోత ఉంటాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉత్తర తెలంగాణ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి మినహా మిగిలిన జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ప్రజలు పగటిపూట అత్యవసర పనులుంటే తప్ప ఎట్టి పరిస్థితుల్లో బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు.

తెలంగాణ ప్రజలకు హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో కాస్త ఉపశమనం పొందిన ప్రజలు, రానున్న మూడు రోజులు తీవ్రమైన వేడిమిని ఎదుర్కోవలసి ఉంటుంది. హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు రానున్న 72 గంటల్లో రాష్ట్రంలో వడగాల్పులు, అధిక ఉక్కపోత ఉంటుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలపై వడగాల్పుల ప్రభావం ఎక్కువగా ఉండనుందని వారు తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల సెల్సియస్‌ను దాటే అవకాశం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వృద్ధులు, పిల్లలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులు తెలిపారు.

ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో రానున్న మూడు రోజులు తీవ్రమైన ఉక్కపోత, ఎండలు, వడగాల్పులు తీవ్రంగా ఉండనున్నాయి. ఈ నేపథ్యంలో.. ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలు పగటిపూట అత్యవసర పనులుంటే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు. ఇక సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి జిల్లాలను మినహాయించి.. మిగిలిన అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయబడింది. ఈ జిల్లాల్లో కూడా వడగాల్పుల ప్రభావం ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

రాత్రిపూట కూడా వాతావరణం వేడిగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల సెల్సియస్‌ను దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని.. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే.. రానున్న మూడు రోజుల తర్వాత.. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వర్షాలు వడగాల్పుల నుండి కొంత ఉపశమనం కలిగించవచ్చని భావిస్తున్నారు. అప్పటి వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండటం.. తగిన జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం.

# బతుకమ్మ ఉత్సవాలు ఇక్కడే..

## అభివృద్ధి పనులను ప్రారంభించిన హైడ్రా కమిషనర్..

హైదరాబాద్: బాగ్ అంబర్‌పేట్‌లోని బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ ప్రారంభించారు. వచ్చే బతుకమ్మ నాటికి కుంట సిద్ధమవుతుందని ఆయన తెలిపారు. బతుకమ్మ కుంటకు సంబంధించిన కోర్టు వివాదం మంగళవారం నాడు కొలిక్కి వచ్చిందని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా.. తెలంగాణ ప్రభుత్వం హైడ్రా లోగోను మార్చి.. నీటిని సూచించేలా కొత్త లోగోను రూపొందించింది. ఈ కొత్త లోగో జలవనరుల ప్రాముఖ్యతను గుర్తుచేస్తూ.. సంస్థ లక్ష్యాలను మరింత స్పష్టంగా తెలియజేస్తుంది.

హైదరాబాద్‌లోని బాగ్ అంబర్‌పేట్‌లో బతుకమ్మ కుంటకు పూర్వ వైభవం రానుంది. స్థానికుల ఆకాంక్షలను నెరవేరుస్తూ.. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్థానికుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాబోయే



బతుకమ్మ ఉత్సవాల నాటికి కుంటను అన్ని విధాలుగా సిద్ధం చేస్తామని స్పష్టం చేశారు. బతుకమ్మ కుంటకు సంబంధించిన కోర్టు వివాదం మంగళవారం నాడు కొలిక్కి వచ్చిందని ఆయన తెలిపారు.

సిటీ సివిల్ కోర్టు చారిత్రక తీర్పునిచ్చింది. బతుకమ్మ కుంట చెరువు కాదు.. ఆ స్థలం నాదే అని కోర్టుకెక్కిన యెడ్ల సుధాకర్ రెడ్డి వాదనలో నిజం లేదని తేల్చి చెప్పింది. యెడ్ల సుధాకర్ రెడ్డి వేసిన సివిల్ సూట్‌ను సిటీ సివిల్ కోర్టు డిస్మిస్ చేసింది. రెవెన్యూ రికార్డులు, విలేజ్ మ్యాప్‌లు, సేటిలైజ్ ఇమేజ్‌లు, సర్వే ఆఫ్ ఇండియా రికార్డుల ఆధారంగా బతుకమ్మ కుంటపై హైడ్రా తరపు న్యాయవాదులు బలమైన వాదనలు వినిపించారు. దాదాపు నెల రోజుల పాటు వాదోపవాదాల అనంతరం సిటీ సివిల్ కోర్టు జడ్జి ఎం. వెంకటేశ్వర రావు బతుకమ్మ కుంటకు ప్రాణం పోస్తూ తీర్పునిచ్చారు. ఈ తీర్పుతో బతుకమ్మ కుంట అభివృద్ధి పనులకు ఆటంకాలు తొలిగాయి.

యుద్ధ ప్రాతిపదికన ఈ చెరువు పునరుద్ధరణ, అభివృద్ధి.. సుందరీకరణ పనులు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ చెరువును అభివృద్ధి చేస్తే పరిసర ప్రాంతాలన్నీ ఆహ్లాదకరంగా మారుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పనులకు సహకరించాలని స్థానిక ప్రజలను ఆయన కోరారు. అభివృద్ధి పనులకు తమ పూర్తి సహకారం ఉంటుందని స్థానికులు కమిషనర్‌కు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా.. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ తన లోగోను మార్చుకుంది. జలవనరులను సూచించేలా కొత్త లోగోను తెలంగాణ ప్రభుత్వం రూపొందించింది. గతంలో ఉన్న లోగో గ్రాండ్‌గా కనిపించగా.. కొత్త లోగో మరింత సరళంగా, అర్థవంతంగా ఉంది. హైడ్రా కార్యాలయం, వాహనాలు , సిబ్బంది యూనిఫాంపై ఈ కొత్త లోగోను ఉపయోగిస్తారని అధికారులు తెలిపారు.

### హైడ్రా కొత్త లోగో..

కొత్త లోగోలో 'హెచ్' అక్షరంపై నీటి బొట్టును చేర్చారు. ఇది నీటి సంరక్షణ, నిర్వహణకు ప్రాధాన్యతనిస్తుంది. ప్రస్తుతం హైడ్రా తన అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతాకు ఈ కొత్త లోగోనే ప్రొఫైల్ పిక్చర్‌గా ఉపయోగిస్తోంది. హైదరాబాద్ నగర ప్రజలను విపత్తుల నుండి రక్షించడానికి.. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు.. నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం ఈ స్వతంత్ర సంస్థను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కొత్త లోగో జలవనరుల ప్రాముఖ్యతను గుర్తుచేస్తూ.. సంస్థ లక్ష్యాలను మరింత స్పష్టంగా తెలియజేస్తుంది.

# లులు మాల్ ఆలోచనకు సలాం కొట్టాల్సిందే..

హైదరాబాద్: హైదరాబాదలోని లులు మాల్ ఇంట్లో అవసరం లేని వస్తువుల కోసం ప్రత్యేక బిన్‌లను ఏర్పాటు చేసింది. వాటిని అవసరమైన వారికి అందిస్తారు లేదా రీసైకిల్ చేస్తారు. దీనివల్ల భూమి కాలుష్యం తగ్గడంతో పాటు.. పర్యావరణ పరిరక్షణకు ఎంతో మేలు చేకూరినట్లు అవుతుంది.. ఇంత గొప్ప ఆలోచన చేసిన లులు మాల్ యాజమాన్యాన్ని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. ఒక నెటిజన్ ఎక్స్‌లో ఓ వీడియో పోస్ట్ చేశారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. సిటీలల్లో షాపింగ్ మాల్స్ అంటే కేవలం కొనుగోళ్లు, తినుబండారాలకే కాదు.. ఇప్పుడు సమాజానికి ఉపయోగపడే మంచి పనులకు కూడా వేదికలవుతున్నాయి. హైదరాబాద్ నడిబొడ్డున కొలువుదీరిన లులు మాల్ ఇందుకు చక్కటి ఉదాహరణ. ఈ మాల్ యాజమాన్యం తీసుకున్న ఓ గొప్ప నిర్ణయం ఇప్పుడు అందరి ప్రశంసలు అందుకుంటోంది. అదేంటంటే.. మీ ఇంట్లో ఇకపై పనికిరావనుకునే వస్తువుల్ని నేరుగా లులు మాల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక బిన్స్‌లో వేయొచ్చు.

హైదరాబాద్‌లో చాలామంది తమ పాత బట్టలు, పాడైపోయిన వస్తువుల్ని మున్సిపాలిటీ వాళ్లకిచ్చేస్తారు. లేదంటే.. ఎక్కడైనా పడేస్తారు. దీనివల్ల భూమి కాలుష్యం పెరిగిపోతుంది. అంతే కాదు పర్యావరణం దెబ్బతినడంతో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. దీని వల్ల భవిష్యత్ తరాల వారికి కూడా హానీ కలుగుతుంది. కానీ లులు మాల్ ఆలోచన మాత్రం అద్భుతం అనే చెప్పాలి. మీ ఇంట్లో వాడని పుస్తకాలు, బట్టలు, బొమ్మల్లాంటివి అక్కడ వేస్తే..



వాటిని నిజంగా అవసరమైన పేద ప్రజలకు అందిస్తారు. అంతేకాదు.. పనికిరాని వాటిని రీసైకిల్ కూడా చేస్తారు. దీనివల్ల చెత్త కుప్పలు తగ్గి, భూమి కాలుష్యం నివారించబడుతుంది.

ఒక నెటిజన్ ఎక్స్‌లో ఓ వీడియో పోస్ట్ చేశారు. మన ఇంట్లో పనికిరాని వస్తువులు ఉంటే.. లులు మాల్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బిన్స్‌లో వేయండి అని చెప్పుకొచ్చారు. ఈ అవకాశం ఈ నెలాఖరు వరకు ఉంటుందని తెలిపారు. ఇలా అనవసరం అనుకున్న వస్తువులను మాల్ యాజమాన్యం.. అవసరం అయిన వారికి ఇచ్చేస్తారన్నారు. దీని వల్ల కాలుష్యం తగ్గుతుందని ఆ వీడియోలో పేర్కొన్నారు.

ఈ వీడియో చూసిన చాలామంది నెటిజన్లు కూడా 'గ్రేట్ ఇనిషియేటివ్', అంటూ లులు మాల్ యాజమాన్యాన్ని ఆకాశానికెత్తేస్తున్నారు. నిజంగానే ఇది గొప్ప విషయం కదా.. మన ఇంట్లో మూలన పడి ఉన్న వస్తువులు ఎవరికో ఒకరికి ఉపయోగపడతాయంటే అంతకన్నా సంతోషం ఏముంటుంది..? లులు మాల్ ఈ మంచి పనిని ఇలాగే కొనసాగిస్తే అందరికీ ఆదర్శంగా నిలుస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇటీవల హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులో అత్యంత ప్రాచుర్యం పొందిన మంజీరా మాల్‌ను లులు మాల్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. లులూ ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్స్ ఈ మాల్‌ను సొంతం చేసుకోవడానికి రూ. 318.42 కోట్ల దివాలా పరిష్కార ప్రణాళికను ఎన్‌సీఎల్‌టీకి సమర్పించింది.

# ఒక్క పూట మాత్రమే విధులు, ఉత్తర్వులు జారీ

తెలంగాణ: తెలంగాణలో పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్లకు తీపికబురు. మండుతున్న ఎండల నేపథ్యంలో వారికి ఒక్క పూట విధులు నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ సృజన మంగళవారం కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. కార్మిక సంఘాల వినతిపై స్పందించిన ప్రభుత్వం, వాతావరణ పరిస్థితులను బట్టి పని సమయాలు సర్దుబాటు చేయాలని సూచించింది. తెలంగాణలోని పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్లకు రేవంత్ సర్కార్ తీపి కబురు చెప్పింది. స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వారికి ఒక్క పూట విధులు నిర్వహించేందుకు అనుమతించింది. రాష్ట్రవ్యాప్తంగా మండుతున్న ఎండల దృష్ట్యా.. వారిని ఒక్క పూట మాత్రమే విధులు నిర్వర్తించేలా అనుమతించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ సృజన మంగళవారం అన్ని జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు పంపారు.



తీవ్రమైన వేసవి పరిస్థితుల్లో గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఒక్క పూట విధులకు అనుమతించాలన్నారు. ఇక వారి వేతనాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఇటీవల పంచాయతీ కార్మిక సంఘాలు సృజనను కలిసి ఈ విషయంలో వినతి పత్రం సమర్పించిన సంగతి తెలిసిందే. దీనికి స్పందనగా స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పని సమయాలను సర్దుబాటు చేయాలని, ఉద్యోగుల ఆరోగ్యం, శ్రేయస్సును పరిరక్షిస్తూ పంచాయతీ పనులు నిరవధికంగా సాగేలా చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆదేశించారు.

కాగా, తెలంగాణలోని పంచాయతీల్లో సుమారు 50 వేలకు పైగా మల్టీ పర్పస్ వర్కర్లు పని చేస్తున్నారు. వీరు గ్రామ పంచాయతీలో అనేక రకాల పనులు నిర్వహిస్తారు. గ్రామంలో వీధులు శుభ్రం చేయటం, చెత్త సేకరించడం, డంపింగ్ యార్డ్‌కు తరలించడం, డ్రైనేజీలను శుభ్రం చేయడం, బ్లీచింగ్ పౌడర్, సున్నం చల్లడం వంటి పనులు చేస్తారు. నీటి ట్యాంకర్లు, ట్రాక్టర్లు నడపడం, నీటి సరఫరా వ్యవస్థను పర్యవేక్షించడం, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలలో మొక్కలకు నీరు పోయడం, వాటిని సంరక్షించడం, ఇంటి పన్ను, ఇతర పన్నుల బిల్లులు వసూలు చేయటంతో పాటు గ్రామ పంచాయతీ ఆదేశాల మేరకు ఇతర పనులు కూడా చేస్తారు.

అయితే మల్టీ పర్పస్ వర్కర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. చాలా సందర్భాలలో వీరికి నెలల తరబడి వేతనాలు సకాలంలో అందడం లేదు. తక్కువ సంఖ్యలో సిబ్బంది ఉండటం వల్ల ఒక్కొక్కరిపై పని భారం ఎక్కువగా ఉంటోంది వీరికి గ్రామ పంచాయతీ ఉద్యోగులుగా సరైన గుర్తింపు ఉండటం లేదు. చాలా మంది కార్మికులు ఏళ్లుగా పనిచేస్తున్నప్పటికీ వారిని రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్‌ను కలిసి తమ గోడును వెళ్లబోసుకోగా.. ఒక్క పూట విధులు నిర్వహించేందుకు అనుమతి ఇచ్చారు.

# గుంతల రోడ్లకు బై బై..

తెలంగాణ: తెలంగాణలో తొలిదశలో 5,189 కిలోమీటర్ల మేర రహదారులను హ్యామ్ విధానంలో అభివృద్ధి చేయాలని అధికారులు గుర్తించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హ్యామ్ రోడ్లు, ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం, జాతీయ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. హ్యామ్ రోడ్ల నిర్మాణ అంచనాలు సిద్ధం చేయాలని, ఆర్ఆర్ఆర్ భూసేకరణ నష్టపరిహారం వేగవంతం చేయాలని ఎన్‌హెచ్ఏఐకి సూచించారు. గుంతల్లేని రహదారుల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్) విధానంలో చేపట్టాల్సిన రహదారుల గుర్తింపు ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చింది. తొలి దశలో రాష్ట్ర వ్యాప్తంగా 5,189 కిలోమీటర్ల మేర రహదారులను అభివృద్ధి చేయాలని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ విషయాన్ని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఉన్నతాధికారులు వివరించారు. సోమవారం సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన కార్యాలయంలో శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రత్యేక కార్యదర్శి హరిచందనలతో కలిసి హ్యామ్ రోడ్లు, ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగం.. జాతీయ రహదారుల ప్రాజెక్టులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హ్యామ్ విధానంలో చేపట్టాల్సిన రోడ్ల గుర్తింపు.. వాటి ఎంపికపై విస్తృతంగా చర్చించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తొలి దశలో ఎంపిక చేసిన హ్యామ్ రోడ్ల పూర్తి స్థాయి నిర్మాణ అంచనాలను తక్షణమే సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేయాలని సంబంధిత కన్సల్టెంట్లను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చిన తర్వాత హ్యామ్ రోడ్లపై మరోసారి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి.. అనంతరం రోడ్ల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తీసుకున్న తర్వాత పనులను ప్రారంభించాలని నిర్ణయించారు. నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం చెల్లించే ప్రక్రియను నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు వేగవంతం చేయాలని మంత్రి కోమటిరెడ్డి సూచించారు. అలాగే.. రాబోయే జాతీయ రహదారి ప్రణాళిక 2025-26కు సంబంధించిన ప్రతిపాదనలను కూడా త్వరగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

# అరెస్టుపై స్పందించిన అఘోరీ

తెలంగాణ: పూజల పేరుతో మోసం చేసి బెదిరింపులకు పాల్పడిందనే ఓ మహిళ ఫిర్యాదుతో లేడీ అఘోరీని పోలీసులు అరెస్టు చేశారు. చీటింగ్, బెదిరింపుల కేసులు నమోదు చేసిన మోకిలా పోలీసులు. నేడు కోర్టులో హాజరు పరచనున్నారు. కాగా, తనను జైలుకు పంపినా వర్షిణితోనే ఉంటానని అఘోరి తెగేసి చెబుతోంది. ఇదిలా ఉండగా.. వర్షిణి బలవంతపు పెళ్లి వ్యవహారం కూడా గతంలో చర్చనీయాంశమైంది. తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన లేడీ అఘోరీ నాగసాధును పోలీసులు మంగళవారం ఉత్తర్‌ప్రదేశ్‌లో అరెస్టు చేశారు. ఆమెతో పాటు ఇటీవల అఘోరిని పెళ్లి చేసుకున్న వర్షిణిని కూడా అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలించారు. పూజల పేరిట రూ.10 లక్షలు తీసుకుని మోసం చేసిందని.. అడిగితే బెదిరింపులకు పాల్పడిందని ఓ మహిళ చేసిన ఫిర్యాదు మేరకు మోకిలా పోలీసులు అఘోరీపై చీటింగ్, బెదిరింపుల కేసులు నమోదు చేశారు.



అఘోరిని అరెస్టు చేసిన పోలీసులు నేడు దాదాపు రెండు గంటల పాటు విచారించారు. ఆ తర్వాత వైద్య పరీక్షల నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి, అనంతరం కోర్టులో హాజరు పరచారు. అరెస్టుపై స్టేషన్ ఎదుట మీడియాతో మాట్లాడిన అఘోరి.. చట్టం తన పని తాను చేస్తుందని చెప్పారు. తాను పోలీసులకు, కోర్టుకు సహకరిస్తానని వెల్లడించారు. తాను జైలుకు వెళ్ళినా.. తన భార్య వర్షిణి తనతోనే ఉంటుందని తెలిపింది.

బాధిత మహిళ ఫిర్యాదు వివరాల ప్రకారం.. ఆరు నెలల క్రితం లేడీ అఘోరితో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత తరచుగా ఫోన్‌లో సంప్రదిస్తూ వ్యక్తిగత వివరాలు తెలుసుకుని, పూజలు చేస్తే జీవితంలో మేలు జరుగుతుందని నమ్మించింది. పూజ ఖర్చుల పేరిట మొదట రూ.5 లక్షలు, తరువాత మరో రూ.5 లక్షలు లేడీ అఘోరి అకౌంట్లో జమ చేయించిందని బాధితురాలు వెల్లడించింది. ఆ తర్వాత పూజలు చేయకపోగా.. తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వలేదు. చివరకు మోసపోయినట్లు గ్రహించిన అఘోరి పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అఘోరిని అరెస్టు చేశారు.

కాగా, గత కొన్ని నెలలుగా లేడీ అఘోరి, వర్షిణిల వ్యవహారం మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. మా కుమార్తెను మాయ మాటలతో లోబరుచుకుని, కేదార్నాథ్‌లో బలవంతంగా పెళ్లి చేసుకున్నాడని వర్షిణి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అంతేకాక, అరెస్టు చేసే ప్రయత్నం చేస్తే ఆత్మహత్య చేసుకుంటామని ఈ జంట ఓ సెల్ఫీ వీడియో ద్వారా హెచ్చరించటమూ ఇటీవల కలకలం రేపింది. తాజాగా అఘోరి అరెస్టుతో ఈ వ్యవహారం మరో మలుపు తిరిగింది.

ఉత్తేజిత దినపత్రిక

## స్థానిక ఎమ్మిగనూరు ఏపీఎస్ఆర్టీసీ డిపోలో రెండు ఎక్స్ప్రెస్ బస్సులను డాక్టర్ బి.వి జయ నాగేశ్వర్రెడ్డి శాసనసభ్యులు చేతుల మీదుగా ప్రారంభించారు. డాక్టర్ బి వి

కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిది





ఎమ్మిగనూరు ఏప్రిల్ 24 గురువారం ఏపీఎస్ఆర్టీసీ డిపోలో రెండు ఎక్స్ప్రెస్ ప్రశ్న ప్రారంభించడానికి సుమారు 11 గంటలకు ఆర్టీసీ డిపో నందు ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ సి. మద్దిలేటి నాయుడు పుష్ప గుచ్ఛం శాలువా కప్పిఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కార్యదర్శి ముస్తాక్ అహ్మద్ సహాయ కార్యదర్శి ఎం ఎండి షరీఫ్ పూలమాల తో ఘనంగా సత్కరించారు. సందర్భంగా శాసనసభ్యులు శ్రీ బీవీ జయ నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి దివంగత నేత మాజీ మంత్రివర్యులు శ్రీ బీవీ మోహన్ రెడ్డి గారి ద్వారా ఏపిఎస్ఆర్టిసి ఎమ్మెల్యే అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరు పట్టణంలో గతంలో ఉన్న ప్రభుత్వం చెత్త క్లీన్ చేయక పేరుకుపోయి ఉండిందని నేను వచ్చిన తర్వాత చెత్త ప్రభుత్వం చేసిన చెత్తను ఎత్తివేయించాలని అదే కాకుండా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎమ్మిగనూరు డిపోకు 23 కొత్త బస్సులను తెప్పించాలని అందులో ఐదు బళ్లారి మూడు బెంగళూరు నాలుగు శ్రీశైలం ఒకటి ఆదోని కర్నూలు ఒకటి అనంతపురం సర్వీసులకు ఎక్స్ ప్రెస్ బస్సులను నడుపుతున్నట్టు తెలిపారు. అదే కాకుండా ఒక సూపర్ లగ్జరీ బస్సును హైదరాబాదుకు వేయించిన ఘనత కూటమి ప్రభుత్వానికి ఆయన అన్నారు. అంచలంచలుగా ఇచ్చిన ప్రతి హామీని పూర్తిచేసే ప్రయత్నం చేస్తున్నామని మాపై బురదజల్లేవారు కళ్ళు పెద్దవి చేసుకుని చూడాలని ఆయన హెచ్చరించారు. ప్రైవేటు బస్సుల స్థానంలో రెండు సూపర్ లగ్జరీ బస్సులను నెల్లూరుకు రెండు బెంగళూరుకు రెండు తిరుపతికి పంపుతున్నట్లు గుర్తు చేశారు. ఇది కాకుండా స్లీపర్ కోచ్ లను మన రాజధాని

విజయవాడకు పెడుతున్నట్లు తొందరలోనే ఆ బస్సులు వస్తాయని ఆయన ఆశ భవాని వ్యక్తం చేశారు. ఇది కాకుండా స్కూలు పిల్లలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు బస్సులను తెప్పించి గూడూరు మీదుగా కర్నూలు తిప్పుతున్నామని ఆయన చెప్పారు. ఇకముందు ఎమ్మిగనూరు పట్టణంలో బస్టాండ్ ను అందంగా తీర్చిదిద్ది కొత్త బస్సులను తెప్పించి ప్రయాణికునికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చేయడమే తన లక్ష్యమని తన కూటమి ప్రభుత్వాలక్షమని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో పాటు ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## 22 కులాల ప్రతినిధులతో ఏర్పాటైన హిందూ రుద్ర స్మశాన వాటిక పరిరక్షణ కమిటీ

కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి



పట్టణము నుండి కర్నూలు కి వెళ్లే ప్రధాన రోడ్డుకు ఇరువైపున గల హిందూ రుద్ర స్మశాన వాటిక భూమి సరిహద్దురాళ్ళను తొలగించి స్మశాన వాటిక స్థలాన్ని కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్న పట్టణంలోని వెంకటాపురం కాలనికి చెందిన గోవర్ధన్ రెడ్డి అనే వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలియజేస్తూము కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి ఎమ్మిగనూరు ఏప్రిల్ 24 గురువారం 22 కులాల ప్రతినిధులతో ఏర్పాటైన హిందూ రుద్ర స్మశాన వాటిక పరిరక్షణ కమిటీ నాయకులు బి ఎల్ నారాయణ, బతకన్న, గణేష్, రంగస్వామి, కొండయ్య, లచ్చన్న పెద్దయ్య, కౌన్సిలర్ దయాసాగర్, మాధవస్వామి, నాగరాజు, రంగన్న, టీ స్టాల్ చంద్ర ల ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు పట్టణ సీఐ శ్రీనివాసులు గారికి ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్కు వెళ్లడం జరిగింది. సిఐ అందుబాటులో లేనందువల్ల ఎ,ఎస్ఐ కృష్ణ నాయక్ సార్ గారికి ఫిర్యాదు పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్మశాన పరిరక్షణ కమిటీ యువ నాయకులు కుమ్మరి వెంకటేష్, మంగళ గిడ్డయ్య, లోకేష్ యాదవ్, కృష్ణ, రవి, మెకానిక్ బీరప్ప, రామస్వామి, లక్ష్మన్న, యాపిలయ్య తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ ఏప్రిల్ 24

సి.బెళగల్ మండలంలోని పోలకల్, సి.బెళగల్ గ్రామాలలో ఆయా గ్రామాల సర్పంచులు పాండురంగన్న, మల్లెపోగు మాదక్క ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ బొంతల మున్నెప్ప ముఖ్య అతిథిగా హాజరై, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం మండల విస్తరణ అధికారి ఈశ్వరయ్య స్వామి మాట్లాడుతూ మనదేశంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 24 న నిర్వహిస్తారని,స్థానిక పరిపాలన వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించడంలో పంచాయతీరాజ్ సంస్థలు

కీలకంగా వ్యవహరిస్తాయని, గ్రామీణ అభివృద్ధిని ప్రోత్సహించడంలో, సామాజిక సాధికారతలో వీటి పాత్రను ప్రజలకు తెలియజేయడం పంచాయతీరాజ్ దినోత్సవ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అలాగే

భారత రాజ్యాంగంలో 45 నిబంధన పంచాయతీరాజ్ సంస్థలను ఏర్పాటు చేయాలని పేర్కొందని, మన దేశంలో మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ అమల్లో దిగువ

స్థాయి-గ్రామపంచాయతీ, 2. మధ్య స్థాయి-పంచాయతీ సమితి, 3. ఉన్నత స్థాయి-జిల్లా పరిషత్ లు ఉన్నాయని తెలిపారు. అనంతరం మండల పరిపాలన అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ పీవీ నరసింహారావు ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థకు రాజ్యాంగ భద్రత కల్పించే లక్ష్యంతో 73వ రాజ్యాంగ సవరణ బిల్లును 1991, సెప్టెంబర్ 16 పార్లమెంట్లో ప్రవేశపెట్టిందని, 1992లో డిసెంబర్ 22న దీనికి ఆమోదం లభించిందని తెలిపారు. ఈ బిల్లు పై అప్పటి రాష్ట్రపతి శంకర్ దయాల్ శర్మ 1993, ఏప్రిల్ 20న ఆమోదముద్ర వేయడంతో 73వ రాజ్యాంగ సవరణ, చట్టంగా మారి 1993 ఏప్రిల్ 24 నుంచి జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం అమల్లోకి వచ్చిందని, దీన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఏప్రిల్ 24న జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకోవాలని అప్పటి ప్రధానమంత్రి మాన్మోహన్ సింగ్ ప్రభుత్వం 2010లో నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి ఈశ్వరయ్య స్వామి, ఏపిఎం రామేశ్వర్, పంచాయతి కార్యదర్శి సునీల్ రాణి, ఏపీఓ రామన్న, మాజీ జెడ్పిటిసి చంద్రశేఖర్, జూనియర్ అసిస్టెంట్ మంజుల, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దొరవారి సత్రం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్

తిరుపతి , ఉత్తేజిత ప్రతినిధి,ఏప్రిల్ 24



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చు ప్రజల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి, మెరుగైన చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ వైద్యాధికారులకు సూచించారు. గురువారం దొరవారి సత్రం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోని ఓపి, ప్రసూతి, రక్త పరీక్షల ల్యాబోరేటరీ, మందుల నిల్వలు పలు విభాగాలను సూళ్లూరుపేట ఆర్ డి ఓ కిరణ్మయి తో కలిసి సందర్శించిన జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు.. అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ఆసుపత్రికి సంబంధించిన కొన్ని విభాగాలను సందర్శించి వాటికి సంబంధించిన సమాచారాన్ని సంబంధిత వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోజుకు ఎన్ని ఓపీలు, రక్త పరీక్షల ల్యాబొరేటరీ కి సంబంధించి ఎన్ని టెస్టులు చేస్తున్నారని డాక్టర్లను ఆరా తీశారు. రోగులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. చికిత్స నిమిత్తం రోగులకు ఇబ్బందులు లేకుండా ఆసుపత్రిలో తగినంత గాలి వెలుతురు ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయలన్నారు.ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, దొరవారి సత్రం తాసిల్దార్ శైలాకుమారి, మెడికల్ ఆఫీసర్ చైతన్య డాక్టర్ చంద్రిక, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలి.

తిరుపతి,ఉత్తేజిత ప్రతినిధి, ఏప్రిల్ 24.



తిరుపతి నియోజకవర్గ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని తిరుపతి నియోజకవర్గ ఇంచార్జి ఓటరు నమోదు అధికారి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య పిలుపునిచ్చారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాల మేరకు గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంచార్జి ఓటరు నమోదు అధికారి మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రజల నుండి వచ్చిన అన్ని దరఖాస్తులను పరిశీలించాలని, వాటి వివరాలు అందుబాటులో ఉంచాలని అన్నారు. ప్రతి రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని అన్నారు. బి.ఎల్. ఓ.లు ఇంటింటి సర్వే చేసి నివాసాలు మారిన వివరాలు సేకరించి ఫారం-8 అప్లై చేశామని, ఇంకా ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని ప్రతినిధులను కోరారు. అందరూ కలసికట్టుగా పనిచేసి పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారు చేసేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణ, కార్పొరేటర్ నరసింహ ఆచారి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మేనెలలో శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, ఏప్రిల్ 24



తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో మే నెలలో పలు విశేష ఉత్సవాలు జరుగనున్నాయి. వాటి వివరాలు ఇలా ఉన్నాయి. మే 1 నుండి 10వ తేదీ వరకు మధురకవి మరియు శ్రీ అనంత అళ్వార్ ఉత్సవం. మే 2న భాష్యకార్ల శాత్మొర నిర్వహించనున్నారు. మే 3న భాష్యకార్ల గంధపు పొడి ఉత్సవం. మే 8న ఉత్తర నక్షత్రం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారు విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు. మే 9 నుండి 11వ తేదీ వరకు బుగ్గోత్సవం. మే 12న శ్రీ గోవిందరాజస్వామివారి పొన్నకాల్వ ఉత్సవం. మే 16, 23, 30వ తేదీల్లో శుక్రవారాల్లో సాయంత్రం 6 గంటలకు శ్రీ ఆండాళ్ అమ్మవారిని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. మే 19వ తేదీ శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని సాయంత్రం 6 గంటలకు శ్రీభూ సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహిస్తారు. మే 27న రోహిణి నక్షత్రం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు రుక్మిణి, సత్యభామ సమేత శ్రీపార్థసారధిస్వామివారు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షిస్తారు. మే 31 నుండి జూన్ 9వ తేదీ వరకు నమ్మాళ్వార్ ఉత్సవం.

## జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం వద్ద ఉగ్ర ముష్కరుల ఆటవిక దాడిలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు జై బీమ్ MRPS ఎమ్మిగనూరు నియోజకవర్గం అధ్యక్షులు,నియోజకవర్గం కమిటీ సంతాపం

కర్నూల్ జిల్లా ఉత్తేజిత ప్రతినిది




ఎమ్మిగనూరు ఏప్రిల్ 24 గురువారం జై భీమ్ ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా ఉప కార్యాలయం నందు సహల్గాం ఉగ్రవాది దాడిలో చనిపోయిన కుటుంబాలకు సంతాపం తెలిపి ఆ మృతులు ఆత్మ శాంతి కొరకు మౌనం పాటించారు అదేవిధంగా ఇంత ఘోరమైన సంఘటనకు వడికట్టిన ఉగ్రవాది ముఠాను మట్టి కారిపించాలి అని జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షులు శవాల. బుజ్జి బాబు మాదిగ భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాం ఉగ్రవాది దాడిలో మృతి చెందిన ప్రతి మృతుల కుటుంబానికి భారత ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వాలు సహాయం చేయాలని జై భీమ్ ఎమ్మార్పీఎస్ కోరడం జరిగింది ఈ కార్యక్రమానికి జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఆదోని డివిజన్ ఎంఎస్ఎఫ్ అధ్యక్షులు సంధి పోగు ఎర్రన్న మాదిగ, జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శవాల సత్యానందం మాదిగ,జై భీమ్ ఎమ్మార్పీఎస్ నందవరం మండల ఇన్చార్జి చింపిరి చిన్న పోతప్ప మాదిగ, జై భీమ్ ఎమ్మార్పీఎస్ నందవరం మండల కన్వీనర్ పరంపోగు సురేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు

## కార్మికుల హక్కుల కు నష్టం కలిగించే నాలుగు లేబర్ చట్టాలు రద్దు చేయాలి

కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి




ఎమ్మిగనూరు : ఏప్రిల్ 24 గురువారం పట్టణంలో స్థానిక సిఐటియు కార్యాలయంలో

కార్మికుల హక్కులకు నష్టం కలిగించే 4 లేబర్ చట్టాలను రద్దు చేయాలని, మే 20న కార్మిక హక్కుల పరిరక్షణకు నిర్వహించు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి అంజిబాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మున్సిపల్ కాంటాక్ట్ కార్మికుల కార్యవర్గ సమావేశం జరిగింది ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం డి అంజిబాబు మండల అధ్యక్ష కార్యదర్శులు పి గోవిందు బి రాముడు మాట్లాడుతూ కార్మిక వర్గం బ్రిటిష్ కాలంలో పోరాడి సాధించుకున్న కనీస వేతన హక్కు చట్టం సమ్మె హక్కు చట్టం 8 గంటల పని విధానం సామాజిక భద్రత చట్టం తదితర చట్టాలు కార్మికులు సాధించుకున్నారని తెలిపారు ల సమయంలో 2019 2020 కాలంలో ఏకపక్షంగా కేంద్ర ప్రభుత్వం కార్మికులకు పూర్తిస్థాయిలో నష్టం చేసే విధంగా నాలుగు లేబర్ చట్టాలను అమలు చేయడానికి సన్నద్ధమవుతుందని అన్నారు ఈ చట్టాలను రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి 2025 ఏప్రిల్ నుండి అమలు చేయాలని సూచనలు చేస్తుందని అన్నారు టిడిపి కూటమి ప్రభుత్వం ప్రధానంగా మున్సిపల్ రంగంలో కాంటాక్ట్ కార్మికులైన వీరికి 60 సంవత్సరాలు పూర్తయిన వారికి తొలగింపు చేయాలని అదేవిధంగా అప్కస్ ను రద్దు పరచి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పడాన్ని సిఐటి వ్యతిరేకిస్తుందని అన్నారు కార్మికులకు సర్వీసును అమానుషంగా తీసివేయడం చాలా అన్యాయం అన్నారు కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ కార్మికులకు గ్రాస్ డ్యూటీ పెన్షన్ వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలని సిఐటియు పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు కార్మికులకు నష్టపరిచే నాలుగు లేబర్ చట్టాలను రద్దు చేసే వరకు కార్మికులు సంఘటితంగా ఉద్యమించాలని అదేవిధంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే 20న లేబర్ చట్టాలను రద్దు చేయాలని దేశవ్యాప్త సమ్మెకు కార్మికులు సమ్మెలో పాల్గొనాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కే ఇస్మాయిల్ బి కేసన్న కే గోరు భాష బి సల్మాన్ కే కాజా బి రంగస్వామి సిఐటియు నాయకులు పి రాజు తిమ్మప్ప పాల్గొన్నారు

## ఉగ్రవాదుల ఏరివేతకు కాశ్మీర్‌ను జల్లెడ పట్టాలి !

పర్యాటక స్వర్గధామం అయిన జమ్మూ కాశ్మీర్‌లో నరమేథం సృష్టించడం ద్వారా అక్కడ సాధారణ పరిస్థితులు రాకుండా...సామాన్య జనం అక్కడ లేకుండా..ముఖ్యంగా హిందువులను లేకుండా చేయాలన్న ముస్లిం ఉగ్రవాదుల కుట్రలో భాగమే తాజా నరమేధానికి నిదర్శనం. 370 ఆర్టికల్ రద్దు తరవాత కాశ్మీర్ అభివృద్ధి చెంది, పర్యాటకంగా పునరుత్తేజం పొందడాన్ని ఉగ్రవాదులు, వారికి సహకరిస్తున్న పాక్ జీర్ణించుకోవడం లేదు. ఈ దాడిని ముందే పసిగట్టడంలో కూడా భద్రతాబలగాలు విఫలం అయ్యారు. ఇకపోతే ఇదొక అనుభవంగా, గుణపాఠంగా కాశ్మీర్‌ను మొత్తం మిలిటరీకి అప్పగించాలి. శ్రీలంకలో ఈలం అన్నది లేకుండా చేసేందుకు సైనిక చర్య చేపట్టి విజయం సాధించారు. అనేక దేశాల్లో ఇలాంటి ఆపరేషన్లు జరిగాయి. ఇప్పుడు కాశ్మీర్‌లో జల్లెడ్ పట్టాలి. అణువణువు పరిశీలించాలి.. అక్కడి స్థానికులను రక్షిస్తూనే... కొత్తగా వస్తున్న వారిపై నిఘా పెంచాలి. జల్లెలడ పట్టాలి. లెఫ్ట్ తీవ్రవాదం కన్నా ఇస్లామిక్ తీవ్రవాదం చాలా ప్రమాదకరం. మావోయిస్టులను ఏరివేసే పనిని పక్కన పెట్టి కాశ్మీర్‌లో ఇస్లామిక్ తీవ్రవాదులను ఏరివేసే కార్యక్రమాలను ముమ్మరం చేయాలి. ఈ క్రమంలో పాక్‌తో సరిహద్దుల్లో భద్రత పటిష్టం చేయాలి. అలాగే ఆక్రమిత కాశ్మీర్‌లో నరమేధానికి శిక్షణ ఇస్తున్న శిబిరాలను లేపేయాలి. అవసరమైతే పాక్ ఆక్మిత కాశ్మీర్‌ను విలీనం చేసుకోవాలి. అందుకు కార్యాచరణ సిద్ధం చేయాలి. భారత్ అంటే బలమేమిటో సత్తా చాటి పాక్‌కు గట్టిగా బుద్ది చెప్పాలి. మాటలతో పాక్ దారికి రాదు. దానికి గట్టిగా ఉద్ది చెప్పేందుకు సైనిక చర్యకు దిగాలి. 2008లో ముంబై దాడి తర్వాత సివిలియన్లపై జరిగిన రెండో అతిపెద్ద ఉగ్రదాడి ఇదే. జమ్మూ కాశ్మీర్ ప్రాంతం పాకిస్తానీ తీవ్రవాదులకు ఇంకా నిలయంగానే ఉందని ఈ సంఘటన చెపుతున్నది. ఉగ్రసంస్థ మతపరమైన లక్ష్యాలను సాధించడానికి లేదా ఒక నిర్దిష్ట మత సమూహానికి వ్యతిరేకంగా దాడులు నిర్వహిస్తోంది. ప్రస్తుతం జరిగిన సంఘటన ఈ రకమైనదే. తహావూర్ హుస్సేన్ రాణాను అమెరికా భారత్‌కు అప్పగించిన తర్వాత దేశంలో ఉగ్రవాద చర్యలు జరిగే అవకాశం ఉందనే సమాచారం కేంద్ర ఇంటెలిజెన్స్ సంస్థ ముందుగానే తెలిపింది. అయితే, కేంద్రం, జమ్మూకాశ్మీర్ ప్రభుత్వం సున్నిత పర్యాటక ప్రాంతమైన జమ్మూలో ముందుగానే కేంద్ర, రాష్ట్ర బలగాలను అప్రమత్తం చేయడంలో కొంత విఫలమైనట్టు ఒప్పుకోవాలి. ఇప్పటికైనా పర్యాటకులకు ఆటంకం లేకుండా నిరంతర గస్తీని పెంచాలి. బలగాలను ప్రతి గ్రామంలోనూ మొహరించాలి. ప్రపంచంలో ఇస్లామిక్ ఉగ్రవాదం భయంకరమైనదిగా నరరమేథం సృష్టిస్తోంది. దీనిని ప్రపంచ ముస్లింలు కూడా తీవ్రంగా వ్యతిరేకించాలే చర్యలకు పూనుకోవాలి. జమ్మూకాశ్మీర్లో మతపరమైన లక్ష్యాలు సాధించేందుకు ఉగ్రదాడులు జరుగుతున్నాయి. ఇస్లామిక్ టెర్రరిస్ట్ గ్రూపులు అయిన లష్కర్ -ఏ - తోయిబా, జైష్ -ఏ - మహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాద సంస్థలు ఈ దాడులు చేస్తున్నాయి. వీరిని ఏరివేసేందుకు ఎలాంటి మీనమేషాలు లెక్కించరాదు. ఎంత కఠినమైన పనయినా వీరిని కలుపు మొక్కల్లా ఏరిపారేయాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వానికి ఉగ్రవాదాన్ని అణచివేసే శక్తి లేకుపోవడం వల్ల కేంద్ర మిలిటరీ వ్యవస్థ జమ్మూకాశ్మీర్ ప్రాంతాన్ని తమ అధీనంలో ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. పాక్ తన కుయుక్తులను కేవలం ఉగ్రదాడులకే ఉపయోగిస్తోంది. పాక్‌ను ఇక ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మడం కాదు...దానిని అన్ని రకాలుగా నిర్వీర్యం చేయాలి. ఇప్పటికే అనేక మారణహోమాలు సాగాయి. ఇలాగే మిన్నకుంటే మరిన్ని దాడులు జరుగుతాయి. భారత్‌పై కన్నేస్తే అంతే సంగతులు అన్నట్లుగా పరిస్థితులు మారాలి. ఇజ్రాయిల్ తరహా శిక్షణతో సైన్యాన్ని రాటుదేలించాలి. పాక్‌ను ప్రపంచంతో వేరు చేసే అన్ని చర్యలు తీసుకోవాలి. అలాగే భారత్ నుంచి ఎలాంటి సాయం అందకుండా

చూడాలి. ఈ క్రమంలో ఇలాంటి టెర్రరిస్టుల దాడులను తీవ్రంగా తీసుకోవాల్సిన బాధ్యత కేంద్రంపైనే ఉంది. తాజా దాడిలో ప్రత్యేకంగా హిందూవర్గంవారిని గుర్తించి మరీ కాల్పులు జరపడం అందరూ ఆలోచించా ల్సిన విషయం. పహల్గాంలో జరిగిన సంఘటనలో బాధితుల ముందు తీవ్రవాదులు చేసిన వ్యాఖ్యలు అత్యంత అమానవీయమైనవి.



# బైక్‌ను మినీ ట్రాక్టర్‌గా మార్చేశాడు..

ప్రకాశం: నేటి కాలంలో వ్యవసాయ పనులు చేయాలంటే.. ట్రాక్టర్ తప్పనిసరి అయ్యింది. భూమి దున్నడం దగ్గర నుంచి పంట కోసి ఇంటికి చేర్చే వరకు.. అనేక సందర్భాల్లో ట్రాక్టర్ అవసరం ఉంటుంది. మరి చిన్న, సన్నకారు రైతులు ట్రాక్టర్ కొనాలంటే అసలు సాధ్యం కాదు. బాడుగకు తెచ్చుకుంటే ఖర్చులు పెరుగుతాయి. ఇదుగో ఈ సమస్యల పరిష్కరించాడు ఓ వ్యక్తి. బైక్‌నే ట్రాక్టర్‌లా పని చేసేలా మార్చాడు. మరి అతడు ఏమైనా గొప్ప గొప్ప యూనివర్శిటీల్లో పెద్ద పెద్ద చదువులు చదివిడా అంటే కాదు.. అతడో సామాన్య బైక్ మెకానిక్. ఆ వివరాలు మీ కోసం

మనిషి తలుచుకుంటే సాధ్యం కానిది ఏది లేదంటారు. మానవ మెదడే అతి పెద్ద అద్భుతం.. మరి దానికి కాస్త పదును పెడితే.. అది సృష్టించే విజయాలు ఎన్నో. చరిత్ర సృష్టించాలంటే.. పెద్ద పెద్ద కాలేజీల్లో.. గొప్ప గొప్ప చదువులు చదవాల్సిన అవసరం లేదు. కాస్త బుర్రకు పదును పెడితే.. ఎన్నో అద్భుతాలు చేయవచ్చు. ఇప్పుడు మనం చెప్పుకోబోయే బైక్ మెకానిక్ కూడా ఇలానే ఆలోచించి.. అద్భుతం చేశాడు. చిన్న ఆలోచనతో లక్షల రూపాయల ఖర్చు చేయాల్సిన అవసరాన్ని అధిగమించాడు. ఒకప్పుడు వ్యవసాయం చేయాలంటే ఎడ్లు కచ్చితంగా ఉండాల్సిందే. ఇప్పుడైతే ట్రాక్టర్ తప్పనిసరి అయ్యింది. మరి చిన్న, సన్నకారు రైతులు లక్షల రూపాయలు ఖర్చు చేసి ట్రాక్టర్ కొనాలంటే కష్టం. ఆ సమస్యను సదరు రైతు మెకానిక్ పరిష్కరించాడు.

ప్రకాశం జిల్లా, జరుగుమల్లి మండలం, ఎడ్లూరిపాడుకు చెందిన హజ్రత్ వలి అనే బైక్ మెకానిక్ కాస్త వినూత్నంగా ఆలోచించి.. ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్‌గా పనిచేసేలా మార్చి.. రైతులకు మేలు చేశాడు. వలి కనిపెట్టిన ఈ పరికరం ద్వారా.. రైతులు వ్యవసాయ పనులు చక్కబెట్టుకోవచ్చు. దీని తయారికి గాను వలికి అవసరమైన మొత్తం కేవలం 20 వేల రూపాయలు మాత్రమే.

**ఒంగోలులో టీడీపీ నేత హత్య..**

బైక్‌ను ట్రాక్టర్‌గా మార్చాలని భావించిన వలి.. ముందుగా తన ద్విచక్ర వాహనం టైర్లను తొలగించి.. వాటి స్థానంలో బురదలో దిగబడకుండా ఉండేందుకు ప్రత్యేకంగా తయారుచేసిన బలమైన బటన్ చక్రాలను అమర్చాడు. దాని సామర్థ్యానికి అనుగుణంగా నాగలి, స్ప్రేయర్, విత్తనాలు వేసే పరికరంతో పాటుగా ట్రాలీని కూడా ఏర్పాటు చేశాడు. తమ అవసరానికి తగ్గట్టు రైతులు ఈ పరికరాలను సులభంగా అమర్చుకునేలా లాకింగ్ సిస్టమ్‌ని కూడా అభివృద్ధి చేశాడు.. దీని కోసం రూ. 20,000 ఖర్చు చేశానని వలి చెప్పుకొచ్చాడు. ఎవరైనా పాత బైక్ తీసుకువస్తే, వారి అవసరాలకు అనుగుణంగా మార్పులు చేస్తానని చెబుతున్నాడు వలి. సాధారణ బైక్ మెకానిక్ సాధించిన ఈ విజయం ప్రతి ఒక్కరిని ఆశ్చర్యపరుస్తుంది. రైతులకు ఎంతో మేలు చేశావని ప్రతి ఒక్కరు అతడిని ప్రశంసిస్తున్నారు.

# మండిపోతున్న సూర్యుడు... ఈ సీజన్‌లోనే రికార్డు ఉష్ణోగ్రత

ఆంధ్రప్రదేశ్: ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మండిపోతున్నాయి. నంద్యాలలో అయితే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నంద్యాల జిల్లాలో ఈ సీజన్‌లోనే గరిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఎండలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. వడదెబ్బ తగలకుండా నిమ్మరసం, పండ్ల రసాలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండ వేడిమిని తట్టుకోవడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోండి. ఈ వేసవిలో మీ ఆరోగ్యాన్ని కాపాడుకోండి!

ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు దంచికొడుతున్నాయి. రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వాతావరణం నిప్పుల కుంపటిని తలపిస్తోంది. ఈ సీజన్‌లో ఎన్నడూ లేని స్థాయిలో నంద్యాల జిల్లాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రత నమోదైంది. బుధవారం నంద్యాల జిల్లా గోనవరంలో 44 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యధికమని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. వైఎస్సార్ జిల్లాలో 28, నంద్యాల 22, ప్రకాశం జిల్లాలో 17, పల్నాడు 14, కర్నూలు జిల్లాలోని పదిచోట్ల 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 135 ప్రాంతాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. గురువారం ఆంధ్రప్రదేశ్‌లోని 30 మండలాల్లో తీవ్రవడగాలులు, 29 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ఉష్ణోగ్రతలు పెరుగుతూ ఉండటం, ఎండవేడిమి నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ సూచించారు.

ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలకు పైగా నమోదవుతున్న నేపథ్యంలో వైద్యులు పలు సూచనలు చేస్తున్నారు. రోజువారీ పనుల కోసం బయట తిరిగే వారు అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలు, తీవ్ర వడగాలుల నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. నిమ్మరసం,



పండ్లరసాలు, మజ్జిగ, కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్ వంటివి తీసుకోవాలని చెప్తున్నారు. వేసవి సీజన్‌లో దొరికే పుచ్చకాయ, కర్బూజా వంటి పండ్లతో పాటుగా కీరదోస, బత్తాయి, ద్రాక్ష, పైనాపిల్ ఎక్కువగా తీసుకోవాలని చెప్తున్నారు. వీటిలో నీటిశాతం అధికంగా ఉంటుందని.. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడతాయని వివరిస్తున్నారు. మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లడం మంచిది కాదని.. తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ వంటివి ధరించాలని సూచిస్తున్నారు.

**వడదెబ్బ ఎవరికి తగులుతుందంటే..**

ఎండాకాలంలో వడదెబ్బ ఫలానా వయసు వారికే తగులుతుందని చెప్పడానికి వీలులేదు. ఎవరికైనా తగలవచ్చు. అయితే శిశువులు, చిన్నపిల్లలు, గర్భిణులతో పాటుగా వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారిపై ఎక్కువ ప్రభావం ఉంటుంది. సెలవుల సీజన్ కావటంతో శుభకార్యాలు, విహార యాత్రలకు ఎక్కువగా వెళ్తుంటారని, ఈ సమయాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తేలికపాటి ఆహారాన్ని తీసుకోవాలని.. వేపుళ్లు, జంక్‌ఫుడ్, మద్యం, మాంసాహారం తక్కువగా తీసుకుంటే మంచిదంటున్నారు. తీవ్రమైన తలనొప్పి, వికారం, వాంతులు, రక్తపోటులో తగ్గుదల వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

# 10 రోజులుగా రైల్వేస్టేషన్‌లోనే బ్యాగ్..

విజయవాడ: విజయవాడ రైల్వేస్టేషన్‌లో మంగళవారం జరిగిన ఓ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనలో పోలీస్ జాగిలం లియోను అందరూ అభినందిస్తున్నారు. రైల్వే డీఐజీ ఆదేశాలతో రైల్వే పోలీసులు విజయవాడ రైల్వేస్టేషన్‌లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో లియో డాగ్ ఓ బ్యాగ్ వద్ద ఆగిపోయింది. క్లోక్ రూమ్‌లోని బ్యాగ్ వద్ద లియో డాగ్ ఆగిపోవటంతో రైల్వే పోలీసులు ఏముందా అని చెక్ చేశారు. అందులో ఉన్నది చూసి షాక్ తిన్నారు. దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు.



తేదీ ఏప్రిల్ 22, 2025 మంగళవారం.. ప్రదేశం విజయవాడ రైల్వేస్టేషన్.. వచ్చీ పోయే ప్రయాణికులతో రైల్వేస్టేషన్ కిటకిటలాడుతోంది. ఈ ఉరుకుల పరుగుల గజిబిజి జీవితంలో ఎవరి దారి వారిదే, ఎవరి పయనం వారిదే. రైళ్లు వస్తున్నాయి, పోతున్నాయి.. ప్రయాణికులు రైళ్లు దిగుతున్నారు, ఎక్కుతున్నారు. అంతలో హఠాత్తుగా కలకలం.. పోలీస్ జాగిలం లియోతో రైల్వేస్టేషన్‌లోకి ఎంట్రీ ఇచ్చారు పోలీసులు. లియో డాగ్ సాయంతో ప్రయాణికుల లగేజీని తనిఖీ చేస్తూ వస్తున్నారు. ఇంతలో ఒకటో నంబర్ ప్లాట్ ఫామ్ మీద ప్రయాణికులు సామాన్లు భద్రపరచుకునే క్లోక్ రూమ్ వచ్చింది. అప్పటి వరకూ గబ గబా పరుగులు తీసిన లియో, అక్కడకు రాగానే ఎర్ర జెండా చూసిన రైలులా ఠపీమని ఆగిపోయింది. లియో వెంట వచ్చిన రైల్వే పోలీసులతో పాటుగా.. ప్లాట్ ఫామ్ మీద ఉన్న రైలు ప్రయాణికుల్లోనూ ఒకటే ఉత్కంఠ.. లియో ఎందుకాగింది?

క్లోక్ రూమ్ ముందు ఆగిన లియో.. నెమ్మదిగా ఆ రూమ్‌లోకి ప్రవేశించింది. ఒక్కొక్క బ్యాగును వాసన చూస్తూ పసిగడుతూ వచ్చిన లియో.. ఒక్క బ్యాగ్ వద్ద ఆగిపోయింది. ఆ అనుమానిత బ్యాగ్ వద్ద నుంచి లియో పక్కకు జరగలేదు. దీంతో రైల్వే పోలీసుల అనుమానం బలపడింది. ఆ అనుమానిత బ్యాగులో ఏముందనే ఉత్కంఠ పెరిగింది. అలాగే ఆ బ్యాగ్ ఎవరిదనే దానిపైనా పోలీసులు దృష్టిపెట్టారు. గుమాస్తాను పిలిపించి.. క్లోక్ రూమ్‌లో కనిపించిన అనుమానిత బ్యాగ్ గురించి వివరాలు అడిగారు. అయితే ఆ బ్యాగ్ ఎవరిదో తమకు తెలియదని.. ఏప్రిల్ పదో తేదీ నుంచి ఆ బ్యాగ్ క్లోక్ రూమ్‌లో ఉన్నట్లు రైల్వే సిబ్బంది సమాధానం ఇచ్చారు. దీంతో ఉత్కంఠ మరింత పెరిగింది.

అనుమానిత బ్యాగ్‌ను ఓపెన్ చేస్తే..

లియో డాగ్ పసిగట్టిన బ్యాగ్‌ను రైల్వే పోలీసులు తెరిచి చూసి షాక్ తిన్నారు. అందులో భారీగా నోట్ల కట్టలు కనిపించాయి. అలాగే బంగారం, వెండి నగలు దర్శనమివ్వటంతో పోలీసుల మైండ్ బ్లాంక్ అయ్యింది. నగదు ఎంత ఉందా అని లెక్కించి చూస్తే రూ.9.70 లక్షలుగా లెక్క తేలింది. అయితే బ్యాగులో ఇతరత్రా వివరాలేవీ కనిపించనట్లు తెలిసింది. భారీగా డబ్బు, నగలు ఉండటం, పదిరోజులుగా రైల్వేస్టేషన్‌లోనే బ్యాగ్ ఉండటంతో పోలీసులు దీనిపై కేసు నమోదు చేశారు. ఆ బ్యాగ్ ఎవరిది, ఆ నగదు, బంగారాన్ని ఎక్కడికి తీసుకెళ్తున్నారనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు. స్మగ్లర్ల పనా అనుకుంటే పది రోజుల పాటు అక్కడే ఉండదుగా అనే అనుమానాలు కూడా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వివిధ కోణాల్లో పోలీసుల దర్యాప్తు జరుగుతోంది. మరోవైపు రైల్వే డీఐజీ బి.సత్య ఏసుబాబు ఆదేశాలతో ఈ తనిఖీలు చేపట్టినట్లు విజయవాడ రైల్వే పోలీసులు తెలిపారు.

# వైసీపీకి దెబ్బ మీద దెబ్బ..

**కదిరి మున్సిపల్ ఛైర్ పర్సన్‌పై బుధవారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీనికి 25మంది కౌన్సిలర్లు హాజరు కాగా.. ఛైర్ పర్సన్‌తో పాటు వైసీపీ 11మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు.**

ఆంధ్రప్రదేశ్: ఏపీలో విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి షాకుల మీద షాకులు తగులుతున్నాయి. అధికారానికి దూరం కావటంతో ఇప్పటికే పలువురు కీలక నేతలు పార్టీని వీడారు. అలాగే చాలాచోట్ల ద్వితీయ శ్రేణి నేతలు కూడా తమ దారి తాము చూసుకుంటున్నారు. కార్పొరేటర్లు, కౌన్సిలర్లు కూడా గోడ దూకుతూ ఉండటంతో ఇప్పటికే పలు కార్పొరేషన్లు. మున్సిపాలిటీలను వైసీపీ కోల్పోయింది. తాజాగా మరో మున్సిపాలిటీ వైసీపీ చేజారింది. కదిరి మున్సిపాలిటీ ఛైర్ పర్సన్ మీద పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది.

ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. అధికారం కోల్పోయిన తర్వాత పలువురు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు



వైసీపీని వీడుతున్న సంగతి తెలిసిందే. వైసీపీ నుంచి కూటమి పార్టీల్లోకి జంప్ అవుతూ ఉండటంతో ఇప్పటికే పలు కార్పొరేషన్లను, మున్సిపాలిటీలను వైసీపీ కోల్పోయింది. తాజాగా శ్రీసత్యసాయి జిల్లాలో వైసీపీకి షాక్ తగిలింది. సత్యసాయి జిల్లా కదిరి మున్సిపాలిటీ వైసీపీ చేజారింది. కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ నజీమున్నిసాపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో కదిరి మున్సిపాలిటీని కూడా వైసీపీ కోల్పోయింది. కదిరి మున్సిపల్ ఛైర్ పర్సన్‌పై బుధవారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీనికి 25మంది కౌన్సిలర్లు హాజరు కాగా.. ఛైర్ పర్సన్‌తో పాటు వైసీపీ 11మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. కోరం ఉండటం... హాజరైన మొత్తం 25మంది అవిశ్వాసానికి మద్దతివ్వడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గింది. అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో కదిరి మున్సిపల్ ఆఫీసు వద్ద పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు.

మరోవైపు కదిరి మున్సిపాలిటీ అవిశ్వాస తీర్మానం నెగ్గటంతో టీడీపీ శ్రేణులు టపాసులు పేలుస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్.. ప్రజాస్వామ్యయుతంగానే అవిశ్వాసం జరిగిందన్నారు. కదిరి మున్సిపల్ ఛైర్ పర్సన్ నజీమున్నిసా అవినీతికి పాల్పడ్డారని.. కదిరిలో అభివృద్ధి లేదని ఆరోపించారు. అందుకే వైసీపీ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టారన్న కందికుంట వెంకటప్రసాద్.. కదిరి అభివృద్ధి కోసమే అవిశ్వాసం పెట్టినట్లు తెలిపారు. త్వరలో అందరికీ ఆమోదకరంగా ఉండేలా మున్సిపల్ ఛైర్ పర్సన్, వైస్ ఛైర్మన్‌ను ఎన్నుకుంటామని వెల్లడించారు.

ఏప్రిల్ 28న విశాఖ మేయర్ ఎన్నిక

మరోవైపు విశాఖపట్నం మేయర్ పీఠం వైసీపీ చేజారిన సంగతి తెలిసిందే. విశాఖ మేయర్ గొలగాని హరి వెంకట కుమారిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం ఇటీవల నెగ్గింది. దీంతో హరి వెంకట కుమారిని మేయర్ పదవి నుంచి తొలగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే ఈ ఆదేశాలు అమలులోకి వస్తాయని అందులో పేర్కొంది. విశాఖ మేయర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి 2/3 వంతు సభ్యులు అనుకూలంగా ఓటు వేయటంతో తీర్మానం నెగ్గింది. 110 మంది సభ్యుల్లో 74 మంది తీర్మానానికి మద్దతుగా ఓటేశారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గగా.. విశాఖ మేయర్ పదవి నుంచి హరి వెంకట కుమారిని తొలగిస్తూ ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. మరోవైపు విశాఖ మేయర్ పదవికి ఏప్రిల్ 28న ఎన్నిక నిర్వహించనున్నారు.

# ప్రమోటర్ల జూమ్ కాల్‌తో మరిన్ని సందేహాలు!

ఆంధ్రప్రదేశ్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉర్సా క్లస్టర్‌కు విశాఖలో 60 ఎకరాల భూమిని కేటాయించడం వివాదాస్పదమైంది. ఎకరా 99 పైసలకే ఇచ్చారంటూ ఆరోపణలు, విమర్శలు వ్యక్తమయ్యాయి. అయితే, ఉర్సా క్లస్టర్ మాత్రం ఎకరా కోటి రూపాయల చొప్పున 3.5 ఎకరాలు, ఎకరా 50 లక్షల చొప్పున మిగిలిన భూమిని తీసుకున్నామని తెలిపింది. దీనిపై అనుమానాలు నివృత్తి చేసేందుకు జూమ్ కాల్ నిర్వహించగా, మరిన్ని ప్రశ్నలు తలెత్తాయని నెటిజన్లు అంటున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల ఆకర్షణకు టీడీపీ కూటమి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. పరిశ్రమలను ఆకర్షించేలా పారిశ్రామిక విధానాలు, అనుమతుల మంజూరులో జాప్యం లేకుండా చూడటం వంటి చర్యలు తీసుకుంటుంది. అయితే ఈ క్రమంలోనే ఏపీ ప్రభుత్వం ఇటీవల తీసుకున్న ఓ నిర్ణయం.. వివాదంగా మారింది. దీనిపై ప్రతిపక్షం వైసీపీ నుంచి అనేక ఆరోపణలు రాగా.. సోషల్ మీడియా నెటిజనం కూడా అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

**ఉర్సా క్లస్టర్స్ వివాదం**

ఇటీవల జరిగిన ఏపీ కేబినెట్ భేటీలో విశాఖపట్నంలోని కాపులుప్పాడలో 56.36 ఎకరాలు, ఐటీ పార్క్‌లో 3.5 ఎకరాలు కలిపి మొత్తం 60 ఎకరాల భూమిని ఉర్సా క్లస్టర్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేటాయించింది. అయితే ఈ భూ కేటాయింపుపైనే విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ భూమిని ఎకరానికి 99 పైసలు చొప్పున కేటాయించారంటూ ఏపీ ప్రభుత్వంపై విమర్శలు వచ్చాయి. రూ. 3,000 కోట్ల విలువైన భూమిని అతి తక్కువ ధరకు ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది.

కేవలం 7 నెలల ముందు అమెరికాలో స్థాపించిన కంపెనీకి 60 ఎకరాల భూమి ఎలా కేటాయించారని.. హైదరాబాద్‌లో రెసిడెన్షియల్ ఫ్లాట్‌లో నడుస్తున్న సంస్థను ప్రభుత్వం ఎలా నమ్మిందంటూ ప్రశ్నలు వ్యక్తమయ్యాయి. అమెరికాలో ఇటీవల రిజిస్ట్రేషన్ అయిన సంస్థకు, అంతగా అనుభవం లేని సంస్థకు భూ కేటాయింపులు అంత హడావిడిగా ఎందుకంటూ కొంతమంది నెటిజనం ప్రశ్నించారు. వారు చేపట్టిన ప్రాజెక్టులు, వారి మొత్తం ఆదాయం, ట్రాక్ రికార్డు చూడకుండా భూకేటాయింపులు ఏమిటని విమర్శలు వచ్చాయి. దీనిపై ప్రతిపక్ష వైసీపీ కూడా ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పించింది.

**వివాదంపై ఉర్సా క్లస్టర్ స్పందన..**

మరోవైపు సోషల్ మీడియాలో పెద్దఎత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఉర్సా క్లస్టర్ స్పందించింది. సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న విధంగా తాము ఎకరా 99 పైసలకు తీసుకోలేదని ఓ ప్రకటనలో క్లారిటీ ఇచ్చింది. ఎకరా కోటి రూపాయలు చొప్పున 3.5 ఎకరాలు.. ఎకరా 50 లక్షల రూపాయలు చొప్పున 56.5 ఎకరాల భూమిని తీసుకున్నట్లు తెలిపింది. ఉర్సా టీమ్ సభ్యులకు సిలికాన్ వ్యాలీలో 1995 నుంచి సంస్థలను నెలకొల్పిన అనుభవం ఉందని పేర్కొంది. కొత్తగా రిజిస్టర్ అయిన కంపెనీ అయినప్పటికీ అనుభవజ్ఞులైన టీమ్ మెంబర్స్ ఉన్నారంటూ క్లారిటీ ఇచ్చింది.

తమ కంపెనీ అమెరికాలో రిజిస్టర్ అయిన కంపెనీ అని. ద్వారా పెట్టుబడులు పెడుతున్నట్లు ఉర్సా క్లస్టర్‌కు చెందిన సతీష్ అబ్బూరి చెప్తున్నారు. భారత దేశ నిబంధనల ప్రకారం, ఇక్కడ కంపెనీ రిజిస్ట్రేషన్ ఉండాలని చెప్పటంతో, టెంపరరీ అడ్రెస్‌తో రిజిస్ట్రేషన్ చేసామని.. అప్రూవల్ అయిన తరువాత ఆపరేషనల్ ఆఫీస్‌కు వెళ్తామని క్లారిటీ ఇచ్చారు. సోషల్ మీడియాలో అనుమానాలు వ్యక్తమవుతూ ఉండటంతో – ఉర్సా క్లస్టర్స్ విషయంలో ఇప్పటి దాకా తలెత్తిన సందేహాలను నివృత్తి చేయడం కోసం ప్రమోటర్లు జూమ్ కాల్ నిర్వహించారు. అయితే ఈ జూమ్ కాల్‌పైనా చక్రవర్తి నలమోతు అనే ఓ నెటిజన్ పలు సందేహాలు వ్యక్తం చేశారు. దీనిపై సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

అది ఉర్సా కాదు.. అర్సా చెప్పిన ఆయన.. కంపెనీ యాజమాన్యంతో అనుమానాల నివృత్తి కోసం కాన్ఫరెన్స్ కాల్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పారదర్శకంగా కాన్ఫరెన్స్ కాల్ పెట్టి ప్రమోటర్లతో మాట్లాడించడం గతంలో ఏ ప్రభుత్వం చేయలేదన్నారు. కాన్ఫరెన్స్ కాల్‌లో జే తల్లూరి, సతీష్ అబ్బూరి, ఎరిక్ వార్నర్ అనే ముగ్గురు మాట్లాడారని తెలిపారు, జే తల్లూరి తనను తాను ఒక ప్రమోటర్‌నని పరిచయం చేసుకున్నారని.. తాము ఒక ప్రమోటర్ల గ్రూప్ అని, వేల కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టడానికి సిద్ధమని చెప్పారన్నారు. అయితే ఎవరు ఈ పెట్టుబడిదారులు అంటే, పేర్లు చెప్పలేం అన్నారని ట్వీట్ చేశారు. నాన్ డిస్‌క్లోజర్ ఒప్పందం కారణంగా పెట్టుబడి పెట్టే వాళ్ళ వివరాలు చెప్పలేమన్నారని వివరించారు. తను మాత్రం 200 కోట్లు పెట్టుబడి పెడుతున్నానని ఆయన చెప్పారని చక్రవర్తి నలమోతు ట్వీట్ చేశారు.

ఇక కాన్ఫరెన్స్ కాల్‌లో మాట్లాడిన సతీష్ అబ్బూరి.. అర్సా క్లస్టర్ భారత దేశంలో కొత్తగా స్థాపించిన కంపెనీ చెప్పారని.. అమెరికాలోని పేరెంట్ సంస్థ పేరేంటి అని అడిగితే, అక్కడ కూడా అర్సా క్లస్టర్ అనే పేరుతోనే రిజిస్టర్ అయిందన్నారని తెలిపారు. " అమెరికాలోని అర్సా క్లస్టర్ ఎప్పుడు స్థాపించారు అంటే అది కూడా స్టార్ట్ అప్ అనీ, సంవత్సరం కిందే స్థాపించామని చెప్పారు. మీ వెబ్‌సైట్ ఏంటి అని అడిగితే %బతీయిఖఎశ్రీశీబఎ.ఎశీఎ% అన్నారు. అదేంటి మీ కంపెనీ పేరు అర్సా క్లస్టర్ కదా అని అడిగితే కన్విన్సింగ్ సమాధానం రాలేదు"" అంటూ ట్వీట్ చేశారు.

"మీరు ప్రభుత్వ భూమి లీజుకి తీసుకుంటున్నారా కొంటున్నారా అంటే, ఎకరం 50 లక్షలకు కొంటున్నాం అన్నారు. అక్కడ ధర ఎకరం 50 కోట్లు లేదని చెప్పారు. ఎంవోయూ బయటపెట్టమని అడిగితే, ప్రభుత్వాన్ని అడిగి చేస్తామన్నారు. మీరు కేశినేని చిన్ని కలిసి చదువుకున్నారా, అని అడిగితే, కాదు నాకు సీనియర్ అని చెప్పారు. కేశినేని నాని ఆరోపించినట్లు మీరు పార్టనర్‌లా అని అడిగితే, కాదన్నారు. అక్కడితో కాల్ ముగిసింది" అని చక్రవర్తి నలమోతు అనే నెటిజన్ ట్వీట్ చేశారు.

అనుమానాలు నివృత్తి చెయ్యడానికి జూమ్ కాల్ పెట్టడం అభినందనీయమే కానీ.. ఈ కాల్ అనుమానాలు నివృత్తి చేయకపోగా మరిన్ని ప్రశ్నలు లేవనెత్తిందని నెటిజన్ అభిప్రాయపడ్డారు. ఇండియా సంస్థ వెనుక అమెరికాలో భారీ సంస్థ లేదని స్పష్టమైందని.. వేల కోట్ల పెట్టుబడి పెట్టే భారీ ఇన్వెస్టర్లు ఉన్నారని చెప్తున్నారు కానీ.. ఎటువంటి ఆధారాలు ఇవ్వలేదన్నారు.

10000 కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టే సత్తా ఉన్నట్లు ఎటువంటి ఆధారాలు చూపలేదని.. అమెరికా కంపెనీ వెబ్‌సైట్ కూడా కేవలం సంవత్సరం క్రితం కొన్నారని.. వెబ్‌సైట్ పేరు కంపెనీ పేరు వేరని ట్వీట్ చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ ఎంవోయూను రద్దు చేయాలని.. లేదంటే సంస్థ గురించి లోతుగా అధ్యయనం చేసే ఈ కంపెనీకి భూమి ఇవ్వాలని నిర్ణయించి ఉంటే, వెంటనే మీరు చేసుకున్న ఎంవోయూ కాపీలు.. బ్యాగ్రౌండ్ వెరిఫికేషన్ బయటపెట్టాలని సూచించారు.

# 35 మార్కులగాళ్లని అవమానం నా కూతురికి 580 మార్కులొచ్చాయి..

ఆంధ్రప్రదేశ్: ఆంధ్రప్రదేశ్ పదో తరగతి పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. టెన్త్ పరీక్షలకు మొత్తం 6,14,459 మంది విద్యార్థులు హాజరుకాగా.. వారిలో 4,98,585 మంది పాసయ్యారు.. మొత్తం 81.14 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికల్లో 84.09 శాతం, బాలురలో 78.31 శాతం పాసయ్యారు. పది ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా 93.90 శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో నిలిచింది.. కాకినాడకు చెందిన నేహాంజని బాలిక 600/600 మార్కులు సాధించారు. టీడీపీ నేత మహాసేన రాజేష్ తన కుమార్తెకు వచ్చిన మార్కులపై స్పందిస్తూ ఎమోషనల్ పోస్ట్ షేర్ చేశారు. తమను కొందరు 35 మార్కులగాళ్లు అని అవమానిస్తారని.. కానీ తన కుమార్తెకు ఏకంగా 580 మార్కులు వచ్చాయని ఆనందం వ్యక్తం చేశారు. చదువు విషయంలో తాను పిల్లల్ని ఏ రోజు ఒత్తిడి చేయలేదని.. తాను చెప్పిన ఒకే ఒక్క మాటను తన కుమార్తె సీరియస్‌గా తీసుకుని 580 మార్కుల సాధించినట్లు తెలిపారు. 'నా భార్య నన్ను తిట్టే ఒకే ఒక అంశం పిల్లల్ని చదవమని గద్దించను, తిట్టను అని..కానీ నా కూతురికి ఒకే ఒక మాట చెప్పాను.. హనీ తల్లీ!.. కొందరు మనల్ని "35 మార్కుల గాళ్ళు" అని అవమానిస్తారు.. "నువ్వు తెచ్చుకునే మార్కులు మన ఆత్మగౌరవం నిలబెడతాయి నాన్న" అని మాత్రమే చెప్పాను.. ఆ మాట నా కూతురు సీరియస్ గా తీసుకుంది అనుకుంట.. మేము ఎప్పటినుంచో పడుతున్న అవమానానికి సమాధానం ఇచ్చింది' అన్నారు. తను కాకినాడ సెయింట్ జోసెఫ్ (బ్లూ కాన్వెంట్ )లో చదివేది.. వైసీపీ ప్రభుత్వంలో నాపై జరిగిన హత్య ప్రయత్నాలు, కేసులు, జైలు వలన సొంత ఊరికి కుటుంబంతో




పాటు వచ్చేసాను.. పిల్లల చదువు పాడవుతుందని భయపడ్డాను.. కానీ దేవుడు నా పక్షానే ఉన్నాడని తెలుసుకున్నాను.. నా గ్రామం ఉత్తరకంచిలో పబ్లిక్ స్కూల్ రూపంలో నా కూతురి భవిష్యత్తుని దేవుడు కాపాడారు..

## దూసుకెళ్తున్న బంగారం ధర.. లక్ష దాటేసి ఇంకా పైపైకి!



దిల్లీ: దేశీయంగా లక్ష రూపాయల మార్క్ దాటి ఆల్‌టైమ్ గరిష్ఠాలకు చేరిన బంగారం ధర.. మరింత పైకి చేరింది. సోమవారం సాయంత్రం తొలిసారి లక్ష రూపాయలు దాటిన 10 గ్రాముల మేలిమి పసిడి ధర.. తాజాగా మరో రూ.2 వేలు పెరిగింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి రూ.1,02,000కు చేరింది. అంతర్జాతీయంగా చూస్తే ఔన్సు బంగారం ధర (31.10 గ్రాములు) 3,467 డాలర్లు పలుకుతోంది.

అటు మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజీలోనూ 10 గ్రాముల పసిడి ధర లక్ష రూపాయలకు చేరువైంది. వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ దీని ధర పెరిగింది. జూన్ నెల డెలివరీ కాంట్రాక్ట్ ధర మంగళవారం ఇంట్రాడేలో రూ.1,899 పెరిగి రూ.99,178కి చేరింది. ఆపై రూ.98,880కు తగ్గింది. ఆగస్టు కాంట్రాక్ట్ ధర రూ.99,800 వద్ద కొనసాగుతుండగా.. అక్టోబర్ కాంట్రాక్ట్ గోల్డ్ మాత్రం ఏకంగా రూ.2వేలు పెరిగి లక్ష రూపాయల మార్కు దాటేసింది.

**అక్షయ తృతీయపై ప్రభావం?**

సాధారణంగా అక్షయ తృతీయకు ఎంతోకొంత బంగారం కొనుగోలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. కానీ, బంగారం ధరలు రికార్డుస్థాయిలో ఉండడంతో కొనుగోలుదారులు వెనకడుగు వేస్తున్నారు. అటు బంగారం వర్తకుల్లోనూ ఇదేతరహా అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొనుగోళ్లు తగ్గే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అక్షయ తృతీయ రోజు నాటికి (ఏప్రిల్ 30న) బంగారం కాస్త అయినా తగ్గుతుందేమోనని చూస్తున్నారు. ఒకవేళ ఇదేస్థాయిలో ధరలు కొనసాగితే ఆ మేర అమ్మకాలపై కొంతమేర ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

**కారణమేంటి?**

టారిఫ్‌ల విషయంలో అమెరికా ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాల దిశగా ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు చైనాతో మాత్రం వివాదం కొనసాగిస్తోంది. అయితే, వడ్డీ రేట్ల కోత విషయంలో ఫెడ్ చీఫ్ జెరోమ్ పోవెల్, ట్రంప్ మధ్య వివాదం నెలకొంది. దీంతో అమెరికా ఆర్థిక వ్యవస్థ గురించి, ఆ దేశ రుణాల గురించి మదుపర్లలో ఆందోళన నెలకొంది. మరోవైపు చైనా సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేంద్ర బ్యాంకులు బంగారాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తుండడంతో పసిడి ధర పెరుగుతోందని అనలిస్టులు పేర్కొంటున్నారు.

## ఈ ఏడాది 7 శాతం పెరగనున్న సిమెంట్ డిమాండ్ - క్రిసిల్



ఈ ఆర్థిక సంవత్సరంలో భారత సిమెంట్ రంగం డిమాండ్ 6.50-7.50% పెరిగే అవకాశం ఉందని క్రిసిల్ అంచనా వేసింది. ముఖ్యంగా దేశంలో మౌలిక సదుపాయాల వ్యయం పెరగడం, ఈ సీజన్‌లో రుతుపవనాలు ఆశాజనకంగా ఉంటాయనే అంచనాలు ఉండడం వల్ల గ్రామీణ గృహాల నిర్మాణాలు ఊపందుకుంటాయని, అందుచేత సిమెంట్ రంగానికి డిమాండ్ పెరుగుతుందని ఒక అంచనా. మౌలిక సదుపాయాల పరంగా..రోడ్లు, రైల్వే రంగాలు సిమెంట్ డిమాండ్‌ను పెంచుతాయని క్రిసిల్ ఇంటెలిజెన్స్ నివేదించింది. అంతేకాకుండా ప్రభుత్వ పథకాల జోరు, వడ్డీ రేటు కోతల ప్రభావం వల్ల పట్టణ గృహ నిర్మాణ రంగం కూడా పుంజుకుంటుందని అంచనా. ప్రధాన మౌలిక సదుపాయాల మంత్రిత్వ శాఖలకు బడ్జెట్ కేటాయింపులలో 10 శాతం పెరుగుదల, సాధారణం కంటే ఎక్కువ రుతుపవనాలు వ్యవసాయ లాభదాయకతను పెంచుతాయని, తద్వారా గ్రామీణ గృహ డిమాండ్ పెరుగుతుందని క్రిసిల్ ఇంటెలిజెన్స్ నివేదిక తెలిపింది.దేశీయ సిమెంట్ డిమాండ్‌లో 29-31 శాతం వాటా కలిగిన మౌలిక సదుపాయాలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా కీలకమైన సిమెంట్ డిమాండ్‌కు అనుగుణంగా ఉంటాయని నివేదిక తెలిపింది. మౌలిక సదుపాయాలలో రోడ్లు అతిపెద్ద వాటాదారుగా ఉన్నాయి, తరువాత రైల్వేలు, నీటిపారుదల, పట్టణ మౌలిక సదుపాయాలు ఉన్నాయి.

## ఎయిర్‌టెల్ చేతికి అదానీ డేటా నెట్‌వర్క్స్ స్పెక్ట్రమ్!

దిల్లీ: ప్రముఖ టెలికాం నెట్‌వర్క్ భారతీ ఎయిర్‌టెల్, తన అనుబంధ సంస్థ భారతీ హెక్సాకామ్ కలిసి అదానీ గ్రూప్‌తో ఒప్పందం చేసుకుంది. అదానీ డేటా నెట్‌వర్క్స్‌కు చెందిన 26 %+ఎ‌ఓ% బ్యాండ్‌లోని 400 మెగాహెర్జ్ స్పెక్ట్రమ్‌ను వినియోగించుకునేందుకు డీల్ కుదుర్చుకుంది. తద్వారా ఎయిర్‌టెల్ తన 5జీ సామర్థ్యాలను, నెట్‌వర్క్ కెపాసిటీని పెంచుకోనుంది. నియంత్రణ సంస్థల ఆమోదానికి లోబడి ఈ లావాదేవీ పూర్తి కానుంది. ఈ డీల్‌కు సంబంధించిన ఆర్థిక వివరాలు తెలియరాలేదు.

2022లో నిర్వహించిన స్పెక్ట్రమ్ వేలంలో అదానీ డేటా నెట్‌వర్క్స్ 400వీహ్జ్‌ఓ స్పెక్ట్రమ్‌ను రూ.212 కోట్లకు దక్కించుకుంది. మొత్తం ఆరు సర్కిళ్ల పరిధిలో ఉన్న ఈ స్పెక్ట్రాన్ని డీల్‌లో భాగంగా ఎయిర్‌టెల్ వినియోగించుకోనుంది. గుజరాత్ (100 వీఎఓ), ముంబయి (100 వీఎఓ), ఆంధ్రప్రదేశ్ (50 వీఎఓ), రాజస్థాన్ (50 వీఎఓ), కర్ణాటక (50 వీఎఓ), తమిళనాడు (50 వీఎఓ)లోని స్పెక్ట్రమ్‌ను ఎయిర్‌టెల్ వాడుకోనుంది. అదనపు స్పెక్ట్రమ్ వల్ల అధిక వేగంతో కూడిన డేటాను వినియోగదారులకు అందించడంతో పాటు, నెట్‌వర్క్ సామర్థ్యాన్ని మరింత పెంచుకుని నాణ్యమైన సేవలను యూజర్లకు అందించడంలో ఎయిర్‌టెల్‌కు ఇది దోహదపడుతుంది.

## 28 నుంచి ఏథర్ ఎనర్జీ ఐపీఓ.. ఈ ఏడాదికిదే తొలి పబ్లిక్ ఇష్యూ!



మార్కెట్ ఒడుదొడుకుల నేపథ్యంలో మదుపర్లు ఐపీఓ అనే పదం విని చాలా రోజులే అయ్యింది. గడిచిన రెండున్నర నెలలుగా ఐపీఓల సందడే దాదాపు కనుమరుగైంది. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ ఐపీఓకు సిద్ధమైంది. ఏప్రిల్ 28 నుంచి దీని సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మెయిన్ బోర్డు నుంచి పబ్లిక్ ఆఫర్‌కు వస్తున్న తొలి ఐపీఓ ఇదే కావడం గమనార్హం.

ఏథర్ ఎనర్జీ సంస్థ ఈ పబ్లిక్ ఇష్యూలో తాజా షేర్ల జారీ ద్వారా రూ.2,626 కోట్లు సమీకరించనుంది. వాస్తవానికి రూ.3,100 కోట్లు సమీకరించాలని తొలుత లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో పాటు 1.1. కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నారు. ప్రమోటర్లు, వాటాదారులు తమ వాటాలను ఆ మేర తగ్గించుకోనున్నారు. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను మహారాష్ట్రలోని ద్విచక్ర వాహన ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు రుణాన్ని తగ్గించుకునేందుకు కంపెనీ వినియోగించుకోనుంది. కొంత మొత్తాన్ని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సామర్థ్యాలు పెంచుకోవడానికి వినియోగించబోతోంది.

## రామ్‌దేవ్ బాబా వ్యాఖ్యలు షాక్‌కు గురిచేశాయి: దిల్లీ హైకోర్టు



యోగా గురువు రామ్‌దేవ్ బాబాపై దిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. హమ్‌దార్ద్ పానీయం విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ఏమాత్రం సమర్థనీయం కావని పేర్కొంది. కొన్ని రోజుల క్రితం హమ్‌దార్ద్ షర్బత్ గురించి రామ్‌దేవ్ బాబా పరోక్షంగా తీవ్ర ఆరోపణలు చేశారు. దానిని కొనుగోలు చేయడం వల్ల వచ్చే లాభాలను కంపెనీ వేరొక వర్గానికి చెందిన నిర్మాణాలు చేపట్టేందుకు ఉపయోగిస్తోందన్నారు. "అదే ఈ షర్బత్ (పతంజలి సంస్థకు చెందిన పానీయం) తాగితే.. గురుకులాలను నిర్మించవచ్చు. పతంజలి విశ్వవిద్యాలయాన్ని విస్తరించవచ్చు" అంటూ రామ్‌దేవ్ మాట్లాడారు. దానికి సంబంధించిన వీడియో వివాదాస్పదమైంది. ఈ క్రమంలో హమ్‌దార్ద్ కంపెనీ దిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. వెంటనే ఆ వీడియోను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరింది.

హమ్‌దార్ద్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఇది ఆ సంస్థ ఉత్పత్తిని అగౌరవపరచడం కంటే తీవ్రమైందని, అవి ద్వేషపూరిత వ్యాఖ్యల కిందికే వస్తాయని వాదించారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. "ఈ వ్యాఖ్యలు కోర్టు అంతరాత్మను షాక్‌కు గురిచేశాయి. ఇలాంటి వ్యాఖ్యలు ఎంతమాత్రం సమర్థనీయం కాదు" అని తీవ్రంగా స్పందించింది.

గతంలో తప్పుదోవ పట్టించే ప్రకటనల వ్యవహారంలో పతంజలి ఆయుర్వేద్ సంస్థ వ్యవస్థాపకులు రాందేవ్ బాబా , ఎండీ ఆచార్య బాలకృష్ణ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పిన సంగతి తెలిసిందే. ఆ ప్రకటనల కేసుపై సుప్రీంకోర్టులో విచారణ కూడా జరిగింది. ఇకపై అలాంటి యాడ్స్ ఇవ్వబోమని వారు కోర్టుకు విన్నవించారు. ఆ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం.. వారిపై ధిక్కరణ కేసును మూసివేసింది. అయితే, తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే తీవ్ర చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ధర్మాసనం హెచ్చరించింది.



## బిగ్ బ్యాటరీ, కర్వ్ డిస్‌ప్లేతో వివో కొత్త 5జీ ఫోన్

ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ వివో కొత్త 5జీస్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. టి సిరీస్‌లో వివో టీ4 5జీ పేరిట దీన్ని కంపెనీ లాంచ్ చేసింది. బిగ్ బ్యాటరీ, ఫాస్ట్ ఛార్జింగ్, కర్వ్ డిస్‌ప్లేతో ఈ ఫోన్ వస్తోంది. ఫోన్ ధర, ఫీచర్లతో పాటు అమ్మకాల వివరాలు ఇప్పుడు చూద్దాం..

వివో టీ4 5జీ 6.77 అంగుళాల ఫుల్ హెచ్‌డీం అమోలెడ్ క్వాడ్ కర్వ్‌డ్ డిస్‌ప్లేతో వస్తోంది. 120%ఎఓ% రిఫ్రెష్ రేటు, 5000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో తీసుకొచ్చారు. స్నాప్‌డ్రాగన్ 7ఎస్ జనరేషన్ 3 ప్రాసెసర్‌ను అమర్చారు. ఆండ్రాయిడ్ 15తో కూడిన ఫన్‌టచ్ ఓఎస్ 15 ఉన్నాయి.

వెనుక వైపు 50 ఎంపీ కెమెరా, 2 ఎంపీ సెకండరీ కెమెరా ఉన్నాయి. ముందువైపు 8 ఎంపీ కెమెరా ఇచ్చారు. ఇక బ్యాటరీ విషయానికొస్తే ఇందులో 7,300 %హాష్ట్ర% బ్యాటరీ ఉంది. 90%ఔ% ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. ఇన్ డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సర్, ఐపీ65 రేటింగ్‌తో వస్తోంది.

ఈ ఫోన్ మొత్తం మూడు వేరియంట్లలో లభిస్తుంది. 8జీబీం128జీబీ వేరియంట్ ధర రూ.21,999, 8జీబీం256జీబీ వేరియంట్ ధర రూ.23,999బీ 12జీబీం256జీబీ వేరియంట్ ధర రూ.25,999గా కంపెనీ నిర్ణయించింది. ఎమరాల్డ్ బ్లేజ్, ఫాంటమ్ గ్రే రంగుల్లో లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్, వివో ఇండియా ఇ-స్టోర్‌తో పాటు ఎంపిక చేసిన రిటైల్ స్టోర్లలో కొనుగోలు చేయొచ్చు.

## ఆరో రోజూ లాభాల్లో సూచీలు



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా ఆరో రోజూ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ.. మన సూచీలు రాణించాయి. ముఖ్యంగా ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ షేర్ల అండతో మన సూచీలు లాభాల్లో ముగిశాయి. గడిచిన ఆరు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ దాదాపు 6వేల పాయింట్ల మేర పెరిగింది. 80 వేల మార్కుకు చేరువవుతోంది.

సెన్సెక్స్ ఉదయం 79,728.39 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 79,408.50) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 79,824.30 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 187 పాయింట్ల లాభంతో 79,595.59 వద్ద ముగిసింది. నిఫ్టీ 41.70 పాయింట్ల లాభంతో 24,167.25 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.19గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో ఐటీసీ, హిందుస్థాన్ యూనిలీవర్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎటర్నెల్ (జొమాటో) షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 67 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్స 3,477 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## అమెజాన్, వాల్‌మార్ట్ కోసం భారత్‌పై అమెరికా ఒత్తిడి!

దేశీయంగా దాదాపు 125 బిలియన్ డాలర్ల ఈకామర్స్ మార్కెట్లో తమ సంస్థల పట్టు పెంచేందుకు భారత్ పై అమెరికా ఒత్తిడి తెస్తోంది. ఈ విషయాన్ని ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక ఓ కథనంలో పేర్కొంది. న్యూదిల్లీపై దాదాపు 26శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఈ చర్చలో ఈకామర్స్ అంశం కూడా వచ్చింది.

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం కోసం విస్తృతస్థాయిలో జరుగుతున్న సదస్సుల్లో ఈకామర్స్ రంగంలోని అన్ని సంస్థలకు సమాన అవకాశాలు, పరిస్థితులు కల్పించే అంశంపై చర్చ జరిగింది. తాజాగా భారత్ పర్యటనలో ఉన్న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా ఈ చర్చలపై స్పందిస్తూ.."ఇరుపక్షాల ప్రయోజనాలను కాపాడేలా చెప్పుకోదగ్గ పురోగతి సాధించాం. ఇంధన, రక్షణ, వ్యూహాత్మక టెక్నాలజీల రంగంలో సహకారాన్ని బలోపేతం చేసుకొంటాం" అని పేర్కొన్నారు.

వాల్‌మార్ట్ అధినేత మెక్‌మిలన్ కొన్నాళ్ల క్రితం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఆ సందర్భంగా భారత్‌లో ఈ కామర్స్ కంపెనీలకు ప్రభుత్వం విధించిన నిబంధనలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. భారత్‌లో ఫ్లిప్‌కార్ట్ యాజమాన్యం వాల్‌మార్ట్ చేతిలో ఉన్న విషయం తెలిసిందే. భారత్‌లో ప్రైస్ ఓపెన్ విధానం అమలుచేయాలని ఒత్తిడి చేస్తోంది. దీంతోపాటు.. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ సంస్థలు దేశీయ రిటైల్ దిగ్గజమైన రిలయన్స్‌తో పోటీపడాలని బలంగా భావిస్తున్నారు.




భారత్‌లో విదేశీ ఈకామర్స్ సంస్థలు కేవలం ఇతరులు తయారుచేసిన వస్తువులను కస్టమర్లకు విక్రయించడానికే వినియోగించాలన్న నిబంధన ఉంది. అదే భారత్‌కు చెందిన కంపెనీలు తయారుచేసిన వస్తువులు సొంత ప్లాట్‌ఫామ్‌ల్లో విక్రయించుకొనే అవకాశం ఉంది. దీనిని టారీఫేతర అడ్డంకిగా అమెరికా ఆరోపిస్తోంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో పరిమితిని కూడా ఇలానే పోలుస్తుంది.

2006 నుంచి భారత్ దేశీయ మార్కెట్లను తమ కంపెనీలకు తెరిపించేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. కానీ, దీనికి తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొంటోంది. ఇక దీనికితోడు భారత్‌లోని విదేశీ ఈకామర్స్ వేదికలు తరచూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ తనిఖీలకు లక్ష్యంగా మారుతున్నాయని ఆయా కంపెనీలు చెబుతున్నాయి.

ఈనేపథ్యంలో భారత్‌తో చర్చల సమయంలో తమ దేశ ఈకామర్స్ దిగ్గజాలను అమెరికా చాలా జాగ్రత్తగా సమన్వయం చేసుకొంటోందని ఈ విషయంతో సంబంధం ఉన్నవారు చెప్పినట్లు ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొంది. ఈ క్రమంలోనే భారత ఈకామర్స్ మార్కెట్‌ను తమ సంస్థలు మరింతగా తెరవాలని న్యూదిల్లీపై ఒత్తిడి తీసుకొస్తోంది. "విదేశీ పెట్టుబడులు దేశంలోకి రావడం స్వాగతించదగిన విషయమే. కానీ, మూల్యంగా భారత రిటైల్ మార్కెట్‌ను ఇష్టానుసారం మార్చేసి.. చిరు వ్యాపారుల ప్రయోజనాలను దెబ్బతీయడం కాదు" అని కన్ఫడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్‌వాల్ పేర్కొన్నారు.

2013లో భారత్‌లో అడుగుపెట్టిన నాటినుంచి అమెజాన్ ఇండియా వరుసగా తన పట్టు పెంచుకొంటూ వస్తోంది. కాకపోతే ఫ్లిప్‌కార్ట్ నుంచి తీవ్రమైన పోటీ ఎదుర్కొంటోంది. అమెజాన్‌కు 40 మిలియన్‌ల డైలీ యాక్టివ్ యూజర్లు ఉండగా.. ఫ్లిప్‌కార్ట్‌కు 50 మిలియన్ల మంది ఉన్నారు.

# ఉగ్రవాదుల పాశవిక చర్య.. 27 మంది పర్యటకులు మృతి





జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి పేట్రేగిపోయారు. అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలో పర్యటకులే లక్ష్యంగా దాడులకు తెగబడ్డారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరన్ ప్రాంతంలో విహారానికి వచ్చిన వారిపై పాశవిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 27 మంది పర్యటకులు ప్రాణాలు కోల్పోగా.. మరో 20 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో జమ్మూకశ్మీర్‌లో అతిపెద్ద ఉగ్ర ఘటన ఇదేనని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు.

మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో బైసరన్ ప్రాంతంలో ఉన్న దాదాపు 40 మంది పర్యటకులను అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఉగ్రవాదులు ఒక్కసారిగా చుట్టుముట్టారు. అనంతరం విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు. దీంతో కొంతమంది అక్కడికక్కడే కుప్పకూలగా.. అనేక మంది తీవ్ర గాయాలపాలయ్యారు. రక్తపు మడుగులో పడిఉన్న మృతదేహాలతో స్థానికంగా భీతావహ వాతావరణం నెలకొంది. తమ వారిని కాపాడాలంటూ పలువురు విజ్ఞప్తి చేస్తున్న దృశ్యాలు బయటకు వచ్చాయి. ఈ ప్రాంతానికి కేవలం కాలినడకన లేదా గుర్రాలపై మాత్రమే చేరుకునే అవకాశం ఉండటంతో బాధితులను తరలించడం కష్టమైంది.

బైసరన్‌లో కాల్పుల శబ్దం వినిపించడంతో వెంటనే అప్రమత్తమైన భద్రతా బలగాలు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి తరలివెళ్లాయి. గాయపడిన వారిని హెలికాప్టర్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే స్థానికులు గుర్రాల సాయంతో పలువురిని తీసుకెళ్లినట్లు సమాచారం. తొలుత మృతుల సంఖ్య తక్కువగానే ఉన్నట్లు పేర్కొన్నప్పటికీ.. ప్రస్తుతం 27కి చేరినట్లు తెలుస్తోంది. గాయపడిన వారిలో మరికొందరి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు.. కాల్పుల ఘటనతో పహల్గాం వీధులు నిర్మానుష్యంగా మారాయి. పర్యటకులు సైతం సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్లు తెలిసింది.

**అమర్‌నాథ్ యాత్ర వేళ..**

38 రోజుల పాటు కొనసాగే అమర్‌నాథ్ యాత్ర జులై 3 నుంచి ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా లక్షల మంది యాత్రికులు రెండు మార్గాల్లో ఇక్కడకు చేరుకుంటారు. అనంత్‌నాగ్ జిల్లాలో పహల్గాం మార్గంలోనే 48 కి.మీ మేర ఉండగా.. 14కి.మీ మార్గం గండేర్బల్ జిల్లా నుంచి ఉంటుంది. ఈ నేపథ్యంలో పర్యటకులపై ఉగ్రవాదులు దాడికి తెగబడటం ఆందోళన కలిగిస్తోంది.

## జమ్మూలో ఉగ్రదాడి.. అమిత్ షాకు మోదీ ఫోన్

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యటకులపై జరిగిన ఉగ్ర దాడిని ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. సౌదీ పర్యటనలో ఉన్న ఆయన.. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడారు. దాడి ఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తగిన చర్యలు తీసుకోవాలని సూచించిన ప్రధాని.. తక్షణమే ఘటనాస్థలానికి వెళ్లి పరిస్థితి సమీక్షించాలని చెప్పారు.

**వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు: అమిత్ షా**

"పర్యటకులపై దాడి తీవ్రంగా బాధించింది. ఇందులో పాల్గొన్న వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. నేరస్థులపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటాం. ఘటన గురించి ప్రధాని మోదీకి వివరించాను. సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించాను. అత్యవసర భద్రతా సమీక్ష కోసం శ్రీనగర్ వెళ్తున్నాను" అని కేంద్ర హోంశాఖ మత్రి అమిత్ షా ట్వీట్ చేశారు.

**తీవ్ర దిగ్భ్రాంతికరం.. క్షమించరాని ఘటన: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము**


జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడి ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "పహల్గాం ఉగ్రదాడి దిగ్భ్రాంతికరం. ఇదొక క్రూరమైన, అమానవీయ చర్య. అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడం భయానకం. ఇది క్షమించరానిది. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా" అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పోస్ట్ చేశారు.



## అంబర్ కోటను సందర్శించిన జేడీ వాన్స్ దంపతులు

నాలుగు రోజుల పర్యటనలో భాగంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కుటుంబంతో సహా సోమవారం భారత్‌కు విచ్చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మంగళవారం వాన్స్ దంపతులు తమ కుమారులు ఇవాన్, వివేక్, కుమార్తె మీరాబెల్‌లతో జయపురలోని అంబర్ కోటను సందర్శించారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, డిప్యూటీ సీఎం దియాకుమార్ వారికి స్వాగతం పలికారు. చంద, పుష్ప అనే ఏనుగులతో వారికి ప్రత్యేక ఆహ్వానాన్ని ఏర్పాటుచేశారు. కోటలో ప్రదర్శించిన పలు రాజస్థానీ సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలను వీక్షిస్తూ.. వాన్స్ కుటుంబం కోటను సందర్శించారు.

## పార్లమెంటే సుప్రీం: ఉప రాష్ట్రపతి



రాష్ట్రపతిని సుప్రీం కోర్టు ఆదేశించలేదంటూ ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా ఆయన మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగపరమైన అంశాల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులే 'అల్టిమేట్ మాస్టర్స్' అని ధన్‌ఖడ్ పేర్కొన్నారు. మంగళవారం ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఎన్నికైన ప్రజాప్రతినిధులు జవాబుదారీతనంగా ఉండాలి. ఎమర్జెన్సీ విధించిన ప్రధాని అయినా సరే. ప్రజలకు రక్షణ కల్పించేందుకే ప్రజాస్వామ్యం. రాజ్యాంగపరమైన అంశాల్లో ప్రజాప్రతినిధులే అల్టిమేట్ మాస్టర్స్. పార్లమెంట్ కంటే అత్యుత్తమమైనది ఉందని రాజ్యాంగంలో ఎక్కడా లేదు. పార్లమెంటే సుప్రీం' అని ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ సమయం గురించి కూడా ధన్‌ఖడ్ ప్రస్తావించారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగిందన్నారు.

## యూఎస్, భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో కీలక ముందడుగు

భారత్- అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో కీలక ముందడుగు పడింది. వాణిజ్య చర్చల కోసం రోడ్ మ్యాప్‌ను వివరించే సూచనలు, నిబంధనలపై ఇరు దేశాలు ఓ అంగీకారానికి వచ్చాయి. త్వరలో జరగబోయే చర్చలు ఈ విషయంలో సమతూకం పాటించడానికి దోహదపడతాయని యూఎస్ వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ (%ఝఎఱవంశీఅ +తీవవతీ%) పేర్కొన్నారు. యూఎస్ వాణిజ్య ప్రతినిధుల కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో గ్రీర్ మాట్లాడుతూ.. అమెరికా- భారత్ వాణిజ్య సంబంధాలలో ఇప్పటివరకు పలు లోపాలు ఉన్నాయని అన్నారు. అమెరికన్ వస్తువులకు కొత్త మార్కెట్లను తెరవడం, ఇక్కడి కార్మికులకు హాని కలిగించే అన్యాయమైన పద్ధతులను తొలగించడం వంటి విషయాలపై ప్రస్తుతం భారత్‌తో చర్చిస్తున్నామన్నారు.

అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయిన అనంతరం ఈ ప్రకటన వెలువడింది. ఇరుదేశాల నేతలు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు భారత్, అమెరికా కొనసాగిస్తున్న చర్చల్లో పురోగతిపై సంతృప్తి వ్యక్తంచేశారు. ఇంధనం, వ్యూహాత్మక సాంకేతికతలు, రక్షణ తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంచుకోవడంపై దృష్టిసారించాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయం వ్యక్తంచేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఏడాది భారత్‌లో చేపట్టనున్న పర్యటన కోసం తాను ఉత్సాహంగా ఎదురుచూస్తున్నట్లు మోదీ పేర్కొన్నారు.



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లపై చాలా దేశాలు ప్రతీకార చర్యలకు సిద్ధమవుతున్న వేళ భారత్ మాత్రం విభిన్నంగా ఆలోచించి.. ప్రతి సుంకాలకు బదులుగా అగ్రరాజ్యంతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంపై దృష్టిసారించింది. ఇటీవల ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి అడుగులు పడిన సంగతి తెలిసిందే. పరస్పర ప్రయోజనాలకు అనుగుణంగా ఒప్పందం చేసుకునేలా దేశాధినేతలు అంగీకారం తెలిపారు. రెండు దేశాల మధ్య ఉన్న వాణిజ్య సమతుల్యాన్ని కొనసాగించేందుకు అమెరికా నుంచి చమురు, గ్యాస్‌ల దిగుమతి పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు భారత విదేశాంగ శాఖ అధికారులు పేర్కొన్నారు. దీనిపై కొంతకాలంగా చర్చలు జరుగుతున్నాయి. తాజా పరిణామాలతో త్వరలోనే ఒప్పందం ఖరారుపై ప్రకటన వెలువడే అవకాశాలు కన్పిస్తున్నాయి.



## మోదీ విమానం రాగానే.. ఫైటర్ జెట్స్‌తో సౌదీ అరుదైన స్వాగతం

ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం సౌదీ అరేబియా పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా అరుదైన సందర్భం చోటుచేసుకుంది. ఎన్నడూ లేనివిధంగా ఆ దేశం మోదీని ప్రత్యేకంగా స్వాగతించింది. మోదీ ప్రయాణిస్తున్న విమానం సౌదీ అరేబియా గగనతలంలోకి ప్రవేశించగానే.. రాయల్ సౌదీ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఎఫ్-15 విమానాలు దానిని అనుసరించి, సగౌరవంగా స్వాగతించాయి. దీనికి సంబంధించిన వీడియోను విదేశాంగశాఖ షేర్ చేసింది. రెండు దేశాల మధ్య రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా అడుగులు పడతాయని ఈ ఆత్మీయ స్వాగతం చాటుతోంది. ప్రధాని రెండు రోజుల పర్యటనలో భాగంగా ఈ రోజు సౌదీ వెళ్లారు. ఇంధనం, వాణిజ్యం, రక్షణ వంటి పలు కీలక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడం లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది. మోదీ, సౌదీ అరేబియా యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్‌ల నడుమ ఇటీవల జరిగిన చర్చల తర్వాత ఇరుపక్షాల మధ్య పలు ఒప్పందాలు కుదిరాయి. భారత్, సౌదీ అరేబియాల మధ్య ఇప్పటికే బలమైన వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంది.

## పాఠాలు బోధించేందుకు కాదు.. స్నేహితుడిలా వచ్చాం: జేడీవాన్స్

భారత్‌తో వాణిజ్య ఒప్పంద చర్చలకు రోడ్‌మ్యాప్ ఖరారైందని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తెలిపారు. యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు విధించిన తరుణంలో వాన్స్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం భారత్ పర్యటనలో ఉన్న ఆయన వాణిజ్య ఒప్పందం దిశగా ప్రధాని మోదీతో చర్చలు జరిపిన సంగతి తెలిసిందే.

"వాణిజ్య చర్చలకు సంబంధించిన నిబంధనలను అమెరికా, భారత్ అధికారికంగా ఖరారు చేశాయి. ట్రంప్- మోదీ దార్శనికతను సాకారం చేసుకునే దిశగా ఇది కీలక అడుగని నేను భావిస్తున్నాను. మన దేశాల మధ్య ఒప్పందానికి ఇది రోడ్‌మ్యాప్‌గా మారనుంది" అని వాన్స్ అన్నారు. రాజస్థాన్ రాజధాని జైపుర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "మన బంధాన్ని బలోపేతం చేసుకోవడానికే మేం ఇక్కడకు వచ్చాం. మీరు ఇలాగే చేయాలని అని పాఠాలు చెప్పడానికి మేం రాలేదు. గతంలో అలా జరిగింది. తక్కువ వేతనాలకు కార్మికులను అందించే దేశంగా భారత్‌ను గత ప్రభుత్వాలు చూశాయి. విమర్శలు చేశాయి. మన రెండు దేశాలు శ్రామిక శక్తిని గౌరవించే భాగస్వాములు. ప్రజాస్వామ్య ప్రపంచంలో



అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభుత్వం ఇదే. మోదీకున్న ప్రజామోద రేటింగ్‌లు నాకు అసూయ కలిగించేలా ఉన్నాయి. ఇదే విషయాన్ని మోదీ వద్ద ప్రస్తావించాను.

అమెరికాతో పాటు భారత్ అభివృద్ధి చెందాలని ట్రంప్ కోరుకుంటున్నారు. మన రెండు దేశాల భాగస్వామ్యం వృద్ధి చెందాలన్నదే ట్రంప్ ఆకాంక్ష. ఇక భారత శిల్పాకళా నైపుణ్యం నన్ను అబ్బురపరిచింది. భారత్.. చరిత్ర, సంప్రదాయాలతో సుసంపన్నమైంది. భవిష్యత్తు పట్ల భారత్ దార్శనికత మెచ్చుకోదగినది. అభివృద్ధి చెందేందుకు భారత్‌లో ఎన్నో అవకాశాలున్నాయి. అలాగే ఏదో సాధించాలనే తపన భారతీయుల్లో అధికం" అని వాన్స్ కొనియాడారు.

కాగా.. అమెరికాకు వివిధ దేశాల నుంచి వచ్చే దిగుమతులపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పన్నుల మోత మోగించిన సంగతి తెలిసిందే. అన్ని దేశాల వారూ తమ ఉత్పత్తులను అమెరికా మార్కెట్లో విక్రయించుకోవచ్చని.. అయితే కనీసం 10% సుంకం చెల్లించాలని ఆయన స్పష్టం చేశారు. భారత్ తమ ఉత్పత్తులపై 52% సుంకం విధిస్తున్నందున, తాము 26% సుంకం విధిస్తున్నట్లు స్పష్టం చేశారు. అయితే ఆ తర్వాత ప్రతీకార సుంకాలను 90 రోజుల పాటు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరేందుకు తగిన సమయం లభిస్తుందని అప్పట్లో అభిప్రాయం వ్యక్తమైంది. అనుకున్నట్టుగానే ఇప్పుడు ఆ దిశగా అడుగులు పడుతున్నాయి.

## యూపీఎస్సీ సివిల్స్ తుది ఫలితాలు వచ్చేశాయ్

దిల్లీ: అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్ - 2024 తుది ఫలితాలు వచ్చేశాయి. ఫలితాలను యూపీఎస్సీ మంగళవారం మధ్యాహ్నం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు.

**టాప్ 10 ర్యాంకర్లు వీరే..**

శక్తి దూబే ప్రథమ ర్యాంకుతో సత్తా చాటగా.. హర్షిత గోయల్ (2), అర్చిత్ పరాగ్ (3), షా మార్గి చిరాగ్(4), ఆకాశ్ గార్గ్ (5), కోమల్ పునియా(6), ఆయుషీ బన్సల్(7), రాజ్‌కృష్ణ ఝా(8), ఆదిత్య విక్రమ్ అగర్వాల్ (9), మయాంక్ త్రిపాఠి(10) ర్యాంకుల్లో మెరిశారు.

**సివిల్స్‌లో మెరిసిన తెలుగు తేజాలు వీళ్లే..**

సివిల్స్ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల నుంచి సత్తా చాటిన విద్యార్థుల్లో ఇ.సాయి శివాని 11వ ర్యాంకుతో మెరిశారు. ఆమె వరంగల్‌లోని శివనగర్‌కు చెందిన రాజు, రజిత దంపతుల ప్రథమ పుత్రిక. తండ్రి మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన టీజీపీఎస్సీ గ్రూప్ పరీక్షలో జోనల్‌వైజ్‌లోనూ 11వ ర్యాంకు సాధించిన సాయి శివాని.. సివిల్స్ ఫలితాల్లోనూ అదే ర్యాంకుతో సత్తా చాటడం విశేషం. అలాగే, సివిల్స్ ఫలితాల్లో బాన్న వెంకటేశ్ 15వ ర్యాంకు సాధించారు. 2023లో సివిల్స్ ఫలితాల్లో 467వ ర్యాంకు సాధించిన వెంకటేశ్




ప్రస్తుతం.. హైదరాబాద్‌లో ఐపీఎస్ శిక్షణ తీసుకుంటున్నారు. మరోవైపు అభిషేక్ శర్మ 38, రావుల జయసింహారెడ్డి 46, శ్రవణ్‌కుమార్ రెడ్డి 62, సాయి చైతన్య జాదవ్ 68, ఎన్ చేతనరెడ్డి 110, చెన్నంరెడ్డి శివగణేష్ రెడ్డి 119, చల్లా పవన్ కల్యాణ్ 146, ఎన్.శ్రీకాంత్ రెడ్డి 151, నెల్లూరు సాయితేజ 154, కొలిపాక శ్రీకృష్ణసాయి 190వ ర్యాంకులతో అదరగొట్టారు.



# కొత్త లుక్ కుదిరిందా?

ప్రతి సినిమాకీ ఓ కొత్త లుక్‌తో ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచే ప్రయత్నం చేస్తుంటారు కథానాయకుడు అల్లు అర్జున్. గత ఐదేళ్లుగా 'పుష్ప' చిత్రాల కోసం గుబురు గడ్డం, పొడవాటి జుట్టుతో మాస్ లుక్‌లో ఉండిపోయిన ఆయన ఇప్పుడు దర్శకుడు అట్లీ సినిమా కోసం మరో కొత్త లుక్‌లోకి మారనున్నారు. వీళ్లిద్దరి కలయికలో రూపొందనున్న ఈ బహుభాషా చిత్రాన్ని సన్‌పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర పూర్వ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుండగా.. తాజాగా ముంబయిలోని మెహబూబ్ స్టూడియోలో బన్నీపై లుక్ టెస్ట్‌తో పాటు కాన్సెప్ట్ ఫొటోషూట్ చేసినట్లు సమాచారం. ఈ సినిమాలో అల్లు అర్జున్ భిన్న గెటప్పుల్లో కనువిందు చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే.

దీనికి తగ్గట్లుగానే ఈ కాన్సెప్ట్ ఫొటో షూట్‌లో అల్లు అర్జున్ పలు లుక్స్‌ను ప్రయత్నించినట్లు సమాచారం. దీంట్లో రగ్గడ్, స్లీక్, ఫ్యూచరిస్టిక్, ఔటర్ స్పేస్.. ఇలా పలు లుక్కులను పరీక్షించినట్లు తెలిసింది. త్వరలోనే వీటిలో నుంచి రెండు లుక్స్ ఫైనల్ చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. సమాంతర ప్రపంచం, పునర్జన్మల కాన్సెప్ట్‌తో ముడిపడి ఉండే సైన్స్‌ఫిక్షన్ సినిమాగా ఇది ముస్తాబు కానున్నట్లు ప్రచారం వినిపిస్తోంది. దీనికోసం చిత్రబృందం ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించే పనిలో ఉంది. ఇందుకోసం హాలీవుడ్‌కు చెందిన ఓ ప్రముఖ వీఎఫ్ఎక్స్ సంస్థ రంగంలోకి దిగింది. అంతర్జాతీయ ప్రమాణాలతో భారీ బడ్జెట్‌తో నిర్మితం కానున్న ఈ సినిమా ఈ ద్వితీయార్ధంలోనే చిత్రీకరణ ప్రారంభించుకోనుంది.



# భారీ ప్రాజెక్ట్‌గా 'మహాభారతం'..

## ఆసక్తికర విషయాలు పంచుకున్న ఆమిర్ ఖాన్

'మహాభారతం' రూపొందించడం తన కల అని స్టార్ హీరో ఆమిర్ ఖాన్ అన్నారు. తనకు ఉన్న పెద్ద ఆశయాల్లో అది కూడా ఒకటని తెలిపారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీని గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. భారతీయ ఇతిహాసానికి తాను ప్రాణం పోయాలనుకుంటున్నట్లు వెల్లడించారు.

"'మహాభారతం'ను నేటితరానికి అందించాలనేది నా కల. ఈ ఏడాది దీని పనులు ప్రారంభించానుకుంటున్నాను. దీని రైటింగ్‌కు కొన్ని సంవత్సరాలు పడుతుంది. ఒకే సినిమాలో దీన్ని చూపించలేం. అందుకే సిరీస్‌లుగా దీన్ని అందించాలని నిర్ణయించుకున్నాను. భారీస్థాయిలో ఈ ప్రాజెక్ట్ రానుంది. ఇండస్ట్రీలోని ఎంతోమంది దర్శకులు దీనిలో వర్క్ చేయనున్నారు. స్టోరీ రాసుకున్న తర్వాత పాత్రలకు ఎవరు సరిపోతారో చూసుకొని నటీనటులను ఎంపిక చేస్తాం. నేను నటిస్తానా లేదా అనేది ఇప్పుడే చెప్పలేను" అని తెలిపారు.

**సినీనటుడు మహేశ్‌బాబుకు ఈడీ నోటీసులు**

ఇక గతంలోనూ ఆమిర్ ఈ ప్రాజెక్ట్ గురించి మాట్లాడారు. "దీని విషయంలో బాధ్యతతోపాటు భయం కూడా ఉంది. ఎలాంటి తప్పు లేకుండా భారీస్థాయిలో దీనిని రూపొందించాలనుకుంటున్నా. భారతీయులుగా ఈ కథ మన రక్తంలోనే ఉంది. కాబట్టి, ఇది నాపై ఎంతో బాధ్యత పెంచింది. ఈ ప్రాజెక్ట్‌తో భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చూపించాలని అనుకుంటున్నా. ప్రతి భారతీయుడు గర్వపడేలా చేయాలనుకుంటున్నా" అని అన్నారు. ఈ ప్రాజెక్ట్ రూ.1000 కోట్లతో రూపొందనున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి.

ఇక ఇప్పటికే బాలీవుడ్‌లో భారీ స్థాయిలో 'రామాయణ' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. నితేశ్ తివారీ దర్శకత్వంలో బాలీవుడ్ అగ్ర నిర్మాతలతో కలిసి అల్లు అరవింద్ ప్రతిష్ఠాత్మకంగా రామాయణాన్ని తెరకెక్కించనున్నారు. 2026 దీపావళికి మొదటి భాగం, 2027 దీపావళికి రెండో భాగంను విడుదల చేయనున్నారు. ఇప్పుడు 'మహాభారతం' కూడా రానుందని చెప్పడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

# 'పెద్ది' షాట్.. క్రెడిట్ అతడికే: బుచ్చిబాబు

రామ్‌చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న సినిమా 'పెద్ది'. కొన్ని రోజుల క్రితం ఈ మూవీ గ్లింప్స్ విడుదలైన సంగతి తెలిసిందే. అందులో రామ్‌చరణ్ క్రికెట్ ఆడే సీన్‌కు నెట్టింట విశేష స్పందన దక్కింది. ఆ షాట్ క్రీడా అభిమానుల్ని ఆకర్షించింది. దీంతో, అది పెద్ది షాట్‌గా ట్రెండ్ అయింది. ఆ విభిన్న ఆలోచన ఎవరిదో దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఫైట్ మాస్టర్ నవకాంత్ ఆ షాట్‌ను డిజైన్ చేశారని, అతడికే క్రెడిట్ ఇవ్వాలనుకుంటున్నానని అన్నారు. "గ్లింప్స్ రిలీజ్ రోజు నేను చరణ్ ఇంట్లోనే ఉన్నా. చిరంజీవి సర్ కూడా అక్కడే ఉన్నారు. ఆయనకు నచ్చుతుందా, లేదా? అని టెన్షన్ పడ్డా. చూశాక బాగుందని చెప్పారు. అది ఎప్పటికీ మర్చిపోలేని జ్ఞాపకం" అని పేర్కొన్నారు.

**రియల్‌ం ఫిక్షనల్: బుచ్చిబాబు**

కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఫిక్షనల్ కథతో ఈ సినిమా తెరకెక్కిస్తున్నట్లు బుచ్చిబాబు తెలిపారు. "నేనెప్పుడూ రూటెడ్ స్టోరీలనే చెప్పాలనుకుంటుంటా. ఆయా కథల్లోని ఎమోషన్, సంఘటనలకు ఎక్కువ మంది కనెక్ట్ అవుతారని భావిస్తా. కొవిడ్ కారణంగా.. నా తొలి సినిమా 'ఉప్పెన' థియేటర్లలో విడుదలవుతుందా, లేదా? అనే సందేహంలో ఉండేవాడిని.



ఆ సమయంలో చాలా చిత్రాలు నేరుగా ఓటీటీలో విడుదలయ్యేవి. ఒకవేళ నా మూవీ కూడా ఓటీటీలోనే రిలీజ్ అయితే నేను పరిశ్రమలో రాణించగలనా? అని టెన్షన్ పడేవాడిని. ఆ టైమ్‌లోనే 'పెద్ది' ఆలోచన వచ్చింది. స్క్రిప్టు పూర్తయిన తర్వాత సుకుమార్ సర్‌కు వినిపించా. బాగుందని చెప్పిన ఆయన రామ్‌చరణ్‌ను కలిసి ఆ స్టోరీ చెప్పమన్నారు. కాన్సెప్టు, హీరో క్యారెక్టరైజేషన్ చరణ్‌కు బాగా నచ్చాయి. చిన్న కరెక్షన్స్ చెప్పి.. సినిమాకి వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు" అని తెలిపారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.



# ప్రకృతికి దగ్గర చేసే అలవాటు ఇది

అవార్డుల కన్నా ప్రేక్షకుల ప్రేమను గెలుచుకోవడమే తనకు ముఖ్యమంటోంది నటి సాయిపల్లవి. థియేటర్లలో కూర్చున్న ప్రేక్షకులు తన పాత్రల భావోద్వేగాలతో కనెక్ట్ కావడాన్ని అసలైన విజయంగా భావిస్తానని తెలిపింది. ఒకవేళ ఆ తర్వాత ఆ పాత్రలకు అవార్డులు దక్కాయంటే అదంతా బోనస్‌గానే అనుకుంటానని చెబుతోంది. "నేనెప్పుడూ నా పాత్రను ఎంచుకునేటప్పుడు కథలో లోతెంత ఉంది.. నా పాత్రలో బలమైన భావోద్వేగం ఉందా? లేదా? అన్నది చూసుకుంటా. నా పాత్రల ద్వారా ప్రేక్షకులకు నిజాయతీ గల కథల్ని చెప్పాలని నిత్యం తపన పడుతుంటా. నేను అనుకున్నట్లుగా ఆ పాత్రల తాలూకూ భావోద్వేగాలతో ప్రేక్షకులు కనెక్ట్ అయ్యారంటే అదే గొప్ప విజయంగా భావిస్తా. అందుకే నేనెప్పుడూ అవార్డుల కన్నా ప్రేక్షకుల ప్రేమను గెలుచుకోవడానికే తొలి ప్రాధాన్యమిస్తుంటా" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం తాను బీకీపింగ్ (తేనెటీగల పెంపకం) పట్ల ఆసక్తి పెంచుకున్నాని, ఈ కొత్త హాబీ తనకు ప్రకృతితో మరింత కనెక్ట్ అయ్యే అవకాశాన్ని ఇస్తోందని తెలిపింది. ఇక 'రామాయణ' చిత్రంతో హిందీలోకి అడుగు పెట్టనున్నందుకు ఉత్సాహంగా ఉందని.. సీత పాత్రలో నటించడం గౌరవంగా ఉందని చెప్పింది సాయిపల్లవి.

# రంగుల పండగకు మర్దానీ 3

మహిళల అక్రమ రవాణా.. కిడ్నాప్ లాంటి అంశాలతో రూపొంది మంచి హిట్ బొమ్మ అనిపించుకున్నాయి 'మర్దానీ' చిత్రాలు. ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్ రాజ్‌ఫిల్మ్స్ నిర్మించిన ఈ సినిమాలు ఇప్పటికే రెండు భాగాలుగా విడుదలై ప్రేక్షకుల్ని మెప్పించాయి. తాజాగా ఈ ఫ్రాంచైజీలో 'మర్దానీ 3' రాబోతున్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ సీనియర్ కథానాయిక రాణీ ముఖర్జీ ప్రధాన పాత్రలో అభిరాజ్ మినావాల దీన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటున్న ఈ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఫస్ట్‌లుక్‌ను పంచుకుంది చిత్రబృందం. "'మర్దానీ 3' కౌంట్‌డౌన్ ప్రారంభమవుతోంది. హెూలీ సందర్భంగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 27న చెడుతో పోరాటం చేయడానికి శివానీ శివాజీ రాయ్ మీ ముందుకు రాబోతుంద"ని వ్యాఖ్యల్ని జోడించింది. ఇందులో మరోసారి పోలీసు అధికారిణి శివానీ రాయ్ పాత్రలో కనిపిస్తూ.. చేతిలో గన్‌తో సినిమాపై అంచనాలను పెంచుతుంది.




# సినీనటుడు మహేశ్‌బాబుకు ఈడీ నోటీసులు



హైదరాబాద్: ప్రముఖ సినీనటుడు మహేశ్‌బాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. ఈనెల 27న విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొంది. సాయిసూర్య డెవలపర్స్, సురానా ప్రాజెక్టు కేసుల్లో ఈడీ ఆయనకు నోటీసులు ఇచ్చింది. ఆ రెండు సంస్థలకు మహేశ్‌బాబు ప్రచారకర్తగా ఉన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు ఆయన ఇన్‌ఫ్లుయెన్స్ చేశారనే అభియోగంపై ఈడీ నోటీసులు జారీ చేసింది. మహేశ్‌బాబుకు ఆయా సంస్థలు చెల్లించిన పారితోషికంపై ఆరా తీయనుంది.

# తమ్ముడు వస్తున్నాడు!

'తమ్ముడు'గా ప్రేక్షకుల్ని పలకరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు నితిన్ . ఆయన.. సప్తమి గౌడ జంటగా నటించిన ఈ చిత్రాన్ని వేణు శ్రీరామ్ తెరకెక్కించారు. దిల్‌రాజు నిర్మించారు. లైలా కీలక పాత్ర పోషించింది. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా జులై 4న థియేటర్లలోకి రానుందని సమాచారం. అక్క – తమ్ముడు అనుబంధాలతో అల్లుకున్న కథతో రూపొందిన చిత్రమిది. క్రీడా నేపథ్య అంశాలు మిళితమై ఉంటాయి. ఇందులో నితిన్ ఆర్చరీ ఆటగాడిగా సందడి చేయనున్నట్లు తెలిసింది. ఈ సినిమాకి అజనీశ్ లోక్‌నాథ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.



Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,